పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
ఆంధ్రజ్యోతి చిరునామా : జి4, గ్రౌండ్ ఫ్లోర్, రామ్స్ అపార్ట్‌మెంట్, ఓల్డ్ నెం. 40, న్యూ నెంబర్ 35, విజయ రాఘవ రోడ్డు, టి.నగర్, చెన్నై - 600 017

ఏకతాటిపై ఉండాలి

కాషాయ వ్యూహానికి అడ్డుకట్ట వేయాలి

● చిదంబరం సభలో మిత్రపక్షాలకు స్టాలిన్ పిలుపు



ఇలయపెరుమాళ్ స్మారక మండపాన్ని ప్రారంభించి, లోపల తిలకిస్తున్న సీఎం స్టాలిన్

చెన్నై, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ద్రావిడ తరహా ప్రభుత్వం చేపడుతున్న సామాజిక సంస్కరణలకు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆది నుంచీ గట్టి మద్దతిస్తున్న వామపక్షాలు, కాంగ్రెస్, డీపీఐ, ముస్లింలీగ్ తదితర పార్టీలన్నీ ఏకతాటిపై ఉంటే ఢిల్లీ పాలకుల కాషాయ వ్యూహాలకు తావుండదని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. కడలూరు జిల్లా చిదంబరం తాలూకా లాల్‌పురంలో తమిళ కాంగ్రెస్ నేత ఎల్.ఇలయపెరుమాళ్ శతజయంతి సందర్భంగా ఆయన కాంస్య విగ్రహంతో కూడిన స్మారక మండపాన్ని మంగళవారం ప్రారంభించారు. ఆ సందర్భంగా సభలో సీఎం మాట్లాడుతూ కామరాజర్ జయంతి సందర్భంగా ప్రజా సమస్యలను పరిష్కరించేలా 'ఉంగలుడన్ స్టాలిన్' (మీతో స్టాలిన్) పేరుతో ప్రత్యేక శిబిరాలను ప్రారంభించానని, 2021 అసెంబ్లీ ఎన్నికలకు ముందు 'మీ నియోజకవర్గంలో స్టాలిన్' పేరుతో ప్రజల నుండి వినతి పత్రాలు స్వీకరించి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వాటిని పరిష్కరించినట్టు తెలిపారు. దివంగత మాజీ కాంగ్రెస్ ఇలయపెరుమాళ్ స్మారక మందిరం ప్రారంభోత్సవంలో డీపీఐ నేత తిరుమావళవన్, ఎంపీ రవికుమార్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, మాజీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి, ముస్లింలీగ్ నేత ఖాదర్‌మొహిద్దీన్, వేల్‌మురుగన్, సీపీఎం నేత బాలకృష్ణన్, సీపీఐ నేత ముత్తరసన్ తదితరులు పాల్గొనటంతోపాటు తామంతా ఐకమత్యంగా ఉన్నామని ఎలుగెత్తి చాటేందుకే వచ్చారని, ఈ ఐక్యత ఇలాగే కొనసాగితే ఢిల్లీ పాలకుల కాషాయ ఎత్తుగడలు రాష్ట్రంలో అమలు చేయడానికి తావుండదన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఈవీ వేలు, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, ఎంపీ సామినాథన్, సీవీ గణేషన్, ఎంపీలు రవికుమార్, విష్ణుప్రసాద్, ఎమ్మెల్యేలు చిందనై సెల్వన్, అయ్యప్పన్, వేల్‌మురుగన్, సబా రాజేంద్రన్, రాధాకృష్ణన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఆవిష్కరణ...

ఇదిలా ఉండగా కాంగ్రెస్ దివంగత నేత ఇలయపెరుమాళ్ స్మారక భవనం ప్రారంభోత్సవానికి ముందు మైలాడుదురై, కొళ్ళిడమ్ బైపాస్‌రోడ్డులో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి కాంస్య విగ్రహాన్ని సీఎం స్టాలిన్ ఆవిష్కరించారు. ఇదే విధంగా చిదంబరం పేట్టై అంబేడ్కర్ నగర్‌లో పునర్నిర్మించిన అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని కూడా ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, డీఎంకే మిత్రపక్షాల నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



ఓ లబ్ధిదారుడికి వినికిడి పరికరాన్ని అమర్చుతున్న స్టాలిన్



చేపాక్‌లో 'ఉంగలుడన్ స్టాలిన్' శిబిరాన్ని పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు



చిదంబరంలో ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేవలను ప్రజల ఇళ్లవద్దకే అందించడంలో భాగంగా కొత్తగా 'ఉంగలుడన్ స్టాలిన్' (మీతో స్టాలిన్) పేరుతో ప్రజా సమస్యల పరిష్కార పథకాన్ని చిదంబరంలో మంగళవారం ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. ఈ పథకం కింద నవంబర్ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 10వేల శిబిరాలను నిర్వహించి, ఆ శిబిరాల్లో ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించి 45 రోజుల్లోగా పరిష్కరించనున్నారు. ఈ పథకంలో భాగంగా మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా 3563 శిబిరాలను ఏర్పాటు చేశారు. వీటిలో 1428 శిబిరాలు నగరాల్లో, 2135 శిబిరాలను గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించారు. ప్రజలు సమర్పించే వినతిపత్రాలను పరిశీలించి వాటిలో అప్పటికప్పుడు పరిష్కరించేందుకు వీలున్న వాటిని అధికారులు తక్షణమే పరిష్కరిస్తారు. 2021 అసెంబ్లీ ఎన్నికలకు ముందు 'మీ నియోజకవర్గంలో స్టాలిన్' పేరుతో, ఆ తర్వాత 'మీ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి' పేరుతో 'ముదల్వరిన్ ముగవరి' (ముఖ్యమంత్రి చిరునామా) పేరుతో 'మక్కలుడన్ ముదల్వర్' (ప్రజలతో ముఖ్యమంత్రి) పేరుతో ఇప్పటివరకూ ప్రజల నుండి వేల సంఖ్యలో వినతి పత్రాలు స్వీకరించారు.

ఈ నేపథ్యంలో మంగళవారం 'ఉంగలుడన్ స్టాలిన్' పేరుతో ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ పథకాన్ని స్టాలిన్ ప్రారంభించారు. ఈ పథకం అమలుకు ప్రతి జిల్లాలో కలెక్టర్లే సమన్వయకర్తలుగా వ్యవహించనున్నారు. చిదంబరంలో ఈ పథకాన్ని ప్రారంభించిన స్టాలిన్ వ్యవసాయ కార్మిక శాఖ, వైద్య ప్రజారోగ్యశాఖ సామాజిక సంక్షేమ శాఖ, మహిళా హక్కుల శాఖ తదితర శాఖల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలపై ఏర్పాటైన ఎగ్జిబిషన్ తిలకించారు. కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఈవీ వేలు, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, సీవీ గణేషన్, ఎంపీలు తిరుమావళవన్, డి. రవికుమార్, డాక్టర్ ఎంకే విష్ణుప్రసాద్, ఎమ్మెల్యేలు సెల్వపెరుంతగై, చిందనైసెల్వన్, వేల్‌మురుగన్, సభా రాజేంద్రన్, కే అయ్యప్పన్, రాధాకృష్ణన్, 'ముదల్వరిన్ ముగవరి' శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి పి. అముధ, కడలూరు జిల్లా కలెక్టర్ సీబీ ఆదిత్యా సెందిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజధాని నగరంలో 6 చోట్ల ...

రాజధాని నగరం చెన్నైలో 'ఉంగలుడన్ స్టాలిన్' ప్రజావిజ్ఞప్తుల శిబిరాలను ఆరు ప్రాంతాల్లో నిర్వహించారు. ఆ మేరకు తండయార్‌పేట పటేల్‌నగర్ పాఠశాల, చూళైమేడు గిల్‌నగర్ క్రీడామైదానం, పట్టాలం స్ట్రాహాన్స్‌రోడ్డులోని కార్పొరేషన్ జోనల్ కార్యాలయం, మాధవరం పోస్టాఫీసు రోడ్డులోని ఎంఆర్ ప్యాలెస్, అంబత్తూరు పారిశ్రామికవాడలోని వేలమ్మాళ్ అరంగం, సైదాపేటలోని అన్నై వేలాంగన్ని కాలేజీ వద్ద ఈ శిబిరాలు జరిపారు. పట్టాలం స్ట్రాహాన్స్‌రోడ్డులోని కార్పొరేషన్ జోనల్ కార్యాలయంలో ఏర్పాటైన శిబిరాన్ని మంత్రి పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్ ప్రియ అధికారులు పరిశీలించారు. ఇదే విధంగా చేపాక్ వద్ద ఏర్పాటైన శిబిరంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా కామరాజర్ జయంతి

● గవర్నర్, సీఎం సహా పలువురు నేతల నివాళి
● పాఠశాలల్లో విద్యా దినం వేడుకలు

ప్యారీస్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీముఖ్యమంత్రి, దేశరాజకీయాల్లో చక్రం తిప్పిన కామరాజర్ 123వ జయంతిని పురస్కరించుకుని విద్యాదినం పేరిట రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు, ఉచిత వైద్యశిబిరాలు, విద్యార్థులకు బహుమతుల ప్రదానం తదితర కార్యక్రమాలు నిర్వహించి కామరాజర్‌ను స్మరించుకున్నారు. గిండిలోవున్న కామరాజర్ స్మారక మందిరంలో ఆయన సమాధిపై గవర్నర్ ఆర్ ఎన్ రవి పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కడలూరు జిల్లా చిదంబరం ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కామరాజర్ చిత్రపటానికి నివాళులర్పించారు. సీఎంతో పాటు టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, టీచర్లు, విద్యార్థులు, విద్యాదాత కామరాజర్‌కు ఘన నివాళులర్పించారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి అరియలూరులో కామరాజర్ చిత్రపటానికి నివాళులర్పించారు. రాష్ట్రప్రభుత్వం తరుపున అన్నాసాలై జింకాన క్లబ్ సమీపంలోని కామరాజర్ విగ్రహానికి మంత్రులు అనితా రాధాకృష్ణన్, పీకే శేఖర్‌బాబు, మేయర్ ప్రియా, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించా రు. అన్నాడీఎం ఆధ్వర్యంలో మాజీమంత్రి డి.జయకుమార్ అధ్యక్షతన మాజీఎంపీలు బాలగంగ, విజయ్‌కుమార్, డా.జయవర్ధన్, ప్రిసీడియం కార్యదర్శి రాయపురం మనో, జిల్లా కార్యదర్శులు వీఎస్ బాబు, వెట్రివేల్ మారిముత్తు, మాజీ ఎమ్మెల్యే బాబు మురుగవేల్ తదితరులు నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, నగర మాజీ మేయర్ కరాటే త్యాగరాయన్, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై తదితరులు కామరాజర్ విగ్రహానికి నివాళులర్పించారు. టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు ఎస్.తిరునావుక్కరసన్, కేవీ తంగబాలు, స్వర్ణ సేతేరామన్, సెల్వం, గోపన్న, జిల్లా అధ్యక్షుడు ఢిల్లీబాబు, శివరాజశేఖరన్, ఉపాధ్యక్షుడు విల్లివాక్కం సురేష్, ముత్తలగన్, కె.చిరంజీవి తదితరులు నివాళులర్పించారు. అలాగే అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్, తమిళ మానిల కాంగ్రెస్ అధ్యక్షుడు జీకే వాసన్, ప్రధాన కార్యదర్శి, వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు జీకే అరుణ్‌కుమార్, బిజుచాకో, మాజీ ఎమ్మెల్యే విడియల్ శేఖర్ తదితరులు కామరాజర్‌కు నివాళులర్పించారు. తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు, నటుడు విజయ్, కోయంబేడులో డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత ఆ పార్టీ శ్రేణులతో కలిసి కామరాజర్ చిత్రపటానికి నివాళులర్పించారు. టి.నగర్ తిరుమలై పిళ్లై రోడ్డులోని కామరాజర్ స్మారక నివాసంలో నాడార్ సంఘాల నాయకులు, రాజకీయ నేతలు జయంతి వేడుకల్లో పాల్గొని పలు సంక్షేమ సహాయాలను ప్రజలకు అందజేశారు.

పాఠశాలల్లో...

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కామరాజర్ జయంతిని విద్యాదినంగా పాటించి ఆ మహనీయుని జీవిత విశేషాలపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కామరాజర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేరన్‌మాదేవి ప్రాంతంలో పర్యటన వెళ్ళి ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుపరచడం, అలాగే ఉచిత విద్య, దేశ రాజకీయాల్లో ఆయన పోషించిన పాత్ర తదితర అంశాలపై చక్కగా మాట్లాడిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యాదినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులందరికీ స్థానిక నేతలు మిఠాయిలు పంపిణీ చేశారు.



కామరాజర్‌కు నివాళులర్పిస్తున్న మంత్రులు అనితా రాధాకృష్ణన్, శేఖర్‌బాబు, మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ తదితరులు









కామరాజర్‌కు నివాళులర్పిస్తున్న మాజీముఖ్యమంత్రి ఈపీఎస్ - కాంగ్రెస్ నేతలు తంగబాలు, తిరునావుక్కరసన్ తదితరులు - తమిళ మానిల కాంగ్రెస్ అధ్యక్షుడు జీకే వాసన్ - తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్

మేమొస్తే రైతులకు

ప్రత్యేక రాయితీలు

● అరియలూరు సభలో ఈపీఎస్



అరియలూరులో రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశమైన అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు రాయితీలు కల్పిస్తామని మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి అరియలూరులో నిర్వహించిన సమావేశంలో రైతులకు హామీ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈపీఎస్ చేపట్టిన తొలివిడత ప్రచార యాత్రలో భాగంగా అరియలూరులో మంగళవారం ఏర్పాటు చేసిన రైతు సమావేశంలో పాల్గొన్నారు. అన్నదాతల మధ్య ఈపీఎస్ మాట్లాడుతూ, గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో రైతులకు ఇచ్చిన సంక్షేమ పథకాలను వివరించారు. తమ ప్రభుత్వ హయాంలో తమ ఐదేళ్ళ పాలనలో రెండుసార్లు రూ.11వేల కోట్ల పంట రుణాలు రద్దు చేశామని, జీడి సాగుకు అవసరమైన వసతులు కల్పించామని, అలాగే పంటలకు సంబంధించి అప్రమత్తం చేసేలా ఫార్మర్స్ యాప్ పరిచయం చేశామని ఈపీఎస్ గుర్తు చేశారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఆచరణకు సాధ్యంకాని హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన డీఎంకే ఇచ్చిన హామీలను ఈ నాలుగేళ్ళలో నెరవేర్చకుండా మోసం చేసిందని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ముఖ్యమంత్రి స్టాలిన్ మళ్ళీ అధికారం కోసం రాష్ట్రప్రజలను మభ్యపెట్టేలా, 'ఉంగలుడన్ స్టాలిన్' పథకాన్ని ప్రారంభించి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్నారని, ఇన్నాళ్ళు సేకరించిన పత్రాలపై ఏ మేరకు పరిష్కారం చేశారో ప్రజలు ఆలోచించాలని ఆయన కోరారు. తాము అధికారంలోకి వస్తే అన్నదాతలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు లబ్ధిచేకూర్చే పథకాలు అమలుపరుస్తామని ఈపీఎస్ పేర్కొన్నారు.

ఆ డీఎస్పీని సస్పెండ్ చేయండి

● డీజీపీకి హైకోర్టు ఆదేశం

అడయార్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అంటరానితనం నిరోధక చట్టం ప్రకారం నమోదైన కేసుపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన కోట్టకుప్పం డీఎస్పీని సస్పెండ్ చేయాలని డీజీపీ శంకర్ జివాల్‌కు హైకోర్టు ఆదేశించింది.

వివరాలిలా...

విల్లుపురం జిల్లా వానూర్ ప్రాంతంలో 5.16 హెక్టార్ల భూములకు సంబంధించి ఆదిద్రావిడ వర్గానికి చెందిన సెంతామరై అనే మహిళకు, మరో సామాజిక వర్గానికి చెందిన వీరస్వామికి మధ్య కొన్నేళ్లుగా వివాదాలున్నాయి. ఈ వివాదాలపై విచారణ జరిపిన దిగువ కోర్టు ఆ స్థలం సెంతామరైకి చెందినదంటూ తీర్పుచెప్పింది. ఆ తీర్పును సవాలు చేస్తూ వీరాసామి వర్గీయులు హైకోర్టులో పిటిషన్ వేశారు. దానిపై విచారణ జరిపిన హైకోర్టు దిగువ కోర్టు తీర్పునే ఖరారు చేసింది. ఆ నేపథ్యంలో మరో సావజిఇక వర్గానికి చెందిన కేశవన్ అనే వ్యక్తి ఆ స్థలం తనదంటూ దిండివనం కోర్టులో పిటిషన్ వేశారు. అంతటితో ఆగకుండా సెంతామరై కుటుంబాన్ని చంపుతానంటూ బెదిరించాడు. 2023లో జరిగిన ఈ సంఘటనపై సెంతామరై వర్గీయులు వానూరు పోలీసుస్టేషన్ ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఆ తరువాత 2024లో ఆ భూములను పరిశీలించేందుకు వెళ్ళిన సెంతామరై బంధువును కేశవన్ కులం పేరుతో దూషించి సెల్‌ఫోన్ లాక్కున్నాడు. దీనిపై కూడా పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. అదే సమయంలో కేశవన్ ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు సెంతామరై వర్గీయులు ఏడుగురిపై కేసులు బనాయించారు. ఈ నేపథ్యంలో సెంతామరై వర్గీయులు తమను కులం పేరుతో దూషించిన కేశవన్ వర్గీయులపై ఎలాంటి చర్యలు తీసుకోని కోట్టకుప్పం డీఎస్పీపై చర్యలు తీసుకునేలా ఉత్తర్వులివ్వాలని హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు న్యాయమూర్తి పి.వేల్‌మురుగన్ విచారణ జరిపారు. మంగళవారం ఉదయం ఈ పిటిషన్ విచారణకు రాగా డీఎస్పీ ఏకపక్షంగా వ్యవహరించడమే కాకుండా అంటరానితనం నిరోధక చట్టం ప్రకారం కేశవన్ వర్గీయులపై చర్యలు తీసుకోలేదని కోర్టుకు వివరించిన పిటిషనర్ల తరపు న్యాయవాది అశోక్‌కుమార్, దానికి సంబంధించిన ఆధారాలను కూడా సమర్పించారు. ఆ వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి పి.వేల్‌మురుగన్ భూములకు సొంతదారులైన సెంతామరై వర్గీయుల ఫిర్యాదును పట్టించుకోకుండా, కేశవన్ వర్గీయుల పిటిషన్లపైనే చర్యలు తీసుకుని, అంటరానితనం నిరోధక చట్టం ప్రకారం తదుపరి చర్యలు కూడా తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన డీఎస్పీని సస్పెండ్ చేసి న్యాయస్థానంలో నివేదిక సమర్పించమంటూ డీజీపీశంకర్ జివాల్‌కు ఉత్తర్వులు జారీ చేసి, కేసు తదుపరి విచారణ వాయిదా వేశారు.

● కీలక పదవి దిశగా అడుగులు

పీఎంకేలోకి

రాందాస్ పెద్దకుమార్తె?





ఓమండూరు సభలో పార్టీ శ్రేణులకు నమస్కరిస్తూ... వేదికపై కూర్చున్న శ్రీకాంతి

టి.నగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తనపై తిరుగుబాటు చేసిన కుమారుడు అన్బుమణికి చెక్ పెట్టేందుకు పీఎంకే అధినేత డాక్టర్ రాందాస్ సిద్ధమయ్యారా?.. ఇందులో భాగంగా తన పెద్ద కుమార్తె శ్రీకాంతిని పార్టీలోకి తీసుకొచ్చేందుకు అడుగులు వేస్తున్నారా?.. ఆ వెంటనే ఆమెకు కీలక పదవి అప్పగించేందుకు కూడా పావులు కదుపుతున్నారా?.. అవుననే అంటున్నాయి పీఎంకే విశ్వసనీయవర్గాలు. పార్టీ నిర్వాహక మండలి నుంచి తొలగించబడిన అన్బుమణి నిర్వహించిన పార్టీ అధ్యక్షపదవీ కాలం ముగిసిందంటూ ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘానికి రాందాస్ లేఖ రాసిన విషం తెలిసిందే. అంతే కాకుండా పార్టీ కార్యనిర్వాహక కమిటీ, కార్యాచరణ మండలి కమిటీ సమావేశాల్లో ఆమోదించిన తీర్మానాల ప్రకారం పార్టీపై సర్వ అధికారాలకు తనకే ఉన్నాయని కూడా స్పష్టం చేశారు.

శ్రీకాంతికి ప్రాధాన్యం

రాందాస్ నిర్వహించే సమావేశాలకు, కార్యక్రమాలకు శ్రీకాంతి తప్పనిసరిగా హాజరవుతున్నారు. ఇటీవల ఓమండూరులో జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వేదికపె శ్రీకాంతి కూర్చున్నారు. ఆ సమావేశంలో పీఎంకే ఎమ్మెల్యే అరుళ్ ముందుగా శ్రీకాంతికి నమస్కరించిన తర్వాతే ప్రసంగించారు. అంతే కాకుండా ఆ సమావేశంలో పాల్గొన్న సీనియర్ నేతలు కొందరు సమావేశం వివరాలను వార్తగా రాసేటప్పుడు శ్రీకాంతికి కూడా కాస్త ప్రాధాన్యం ఇవ్వమని మీడియా ను కోరటం గమనార్హం. ఈ నేపథ్యంలో పూంపుహార్ మహిళా సదస్సు ఏర్పాట్లను పరిశీలించేందుకు వెళ్ళిన రాందాస్.. తన కుమార్తె శ్రీకాంతి గురించి మాట్లాడుతూ.. ఆమెకు పార్టీ పదవి ఇస్తానో లేదో వేచి చూడాలంటూ 'పోగ పోగ తెరియుమ్' (పోను పోనూ తెలుస్తుంది) అనే అలనాటి మేటి తమిళ సినిమా పాట పల్లవి అందుకున్నారు. ఈ విషయమై రాందాస్ సన్నిహితులు మాట్లాడుతూ అన్బుమణికి చెక్ పెట్టేందుకే కుమార్తెకు కీలక బాధ్యతలు అప్పగించాలని పెద్దాయన భావిస్తున్నట్లు తెలిపారు.

తోబుట్టువు నుంచి వ్యతిరేకత...

డాక్టర్ అన్బుమణికి సోదరి శ్రీకాంతికి మధ్య కొద్ది నెలలుగా సన్నిహిత సంబంధాలు లేవు. తన కుమారుడు ముకుందన్‌ను పీఎంకే యువజన విభాగం అధ్యక్షుడిగా రాందాస్ ప్రకటించినప్పుడు వేదికపై ఉన్న అన్బుమణి తీవ్రంగా వ్యతిరేకించిన విషయాన్ని శ్రీకాంతి సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే తండ్రి మాట జవదాటని కుమార్తెగా శ్రీకాంతి పార్టీలో క్రియాశీలక పదవి చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని పసిగట్టే అన్బుమణి ఈ నెల 10వ తేదీ రాత్రి రాందాస్ లేని సమయంలో తైలాపురం గార్డెన్ నివాసానికి వెళ్ళి తల్లిని కలుసుకున్నారు. ఆ సందర్భంగా శ్రీకాంతికి పట్టంకట్టేందుకు రాందాస్ చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని అన్బుమణి తల్లికి విజ్ఞప్తి చేసినట్లు సమాచారం.

సమాచార దర్శిని

పీజీ కోర్సులకు దరఖాస్తు గడువు పొడిగింపు

పెరంబూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసేందుకు ఈనెల 31వ తేది వరకు పొడిగించారు. దరఖాస్తు గడువు మంగళవారంతో ముగిసింది. విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు గడువు పొడిగించారు. పీజీ కోర్సుల ర్యాంకుల జాబితా ఆగస్టు 4వ తేది ఆయా కళాశాలలకు పంపనున్నామని, మొదటి సంవత్సరం తరగతులు ఆగస్టు 20 నుంచి ప్రార ంభమవుతాయని ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ ప్రకటనలో తెలిపారు.

కళాత్మక గ్రంథాలకు ప్రభుత్వ సాయం

పెరంబూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కళాత్మకమైన గ్రంథాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయనుంది. తమిళనాడు సంగీత, సాహిత్య, నాటక అకాడమీ, తమిళ కళ, సాహిత్యం, సంస్కృతి, చరిత్ర, పురాణాలు, సామాజిక నాటకం, నృత్య నాటక సంస్థలకు రూ.1.50 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తోంది. అలాగే, కళల సంబంధిత రచనలు చేసే ఐదుగురు రచయితలు, ప్రచురణకర్తలకు ఒక్కొక్కరిని రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తుంది. ఆసక్తి కలిగిన రచయితలు, ప్రచురణ కర్తలు దరఖాస్తులను ఈ నెల 31వ తేది లోపు పంపించాలని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

హైకోర్టు ప్రాంగణంలో 'కామధేను' దుకాణం

పెరంబూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడ్‌వే సమీపంలోని మద్రాసు హైకోర్టు ప్రాంగణంలో ట్రిప్లికేన్ నగర సహకార సంఘం ఆధ్వర్యంలో 'కామధేను' సహకార ప్రత్యేక దుకాణం ఏర్పాటుచేశారు. ఈ దుకాణాన్ని హైకోర్టు న్యాయమూర్తి పీటీ ఆషా సోమవారం ప్రారంభించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కేఆర్ శ్రీరామ్, న్యాయమూర్తులు సుబ్రమణియన్, సురేష్‌కుమార్, మాల తదితరులు దుకాణాన్ని పరిశీలించారు. ఈ దుకాణంలో కిరాణా సామగ్రి సహా సహకార ఉత్పత్తులు 5 నుంచి 50 రాయితీ ధరకు విక్రయించనున్నారు. దుకాణానికి సమీపంలో గ్రీన్ వెజిటెబుల్ షాపులో కూరగాయలు, ఆకుకూరలు విక్రయించనున్నారు. అలాగే, కోర్టు ఉద్యోగులకు సహకార క్యాంటీన్ ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.

గ్రూప్-2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

పెరంబూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2, 2ఏ ప్రిలిమినరీ పరీక్షల నోటిఫికేషన్‌ను తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) విడుదల చేసింది. ఎస్ఐ, జూనియర్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ తదితర గ్రూప్-2 పోస్టులకు సెప్టెంబరు 28వ తేది ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించనున్నారు. సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ తదితర గ్రూప్-2ఏ పోస్టులు భర్తీకానున్నాయి. 645 పోస్టుల భర్తీకి నిర్వహించనున్న పరీక్షకు అర్హులైన వారు మంగళవారం నుంచి ఆగస్టు 13వ తేది వరకు https://www.tnpsc.gov.in/ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని టీఎన్‌పీఎస్సీ నోటిఫికేషన్‌లో తెలియజేసింది.

మహిళలకు హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ

పెరంబూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): 'నాన్ ముదల్వన్' పథకంలో రోడ్డు రవాణా సంస్థ (ఐఆర్‌టీ) మహిళలకుహెవీ వెహికల్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనుంది. ఆ ప్రకారం, గుమ్మిడిపూండి, విల్లుపురం, వేలూరు, తిరుచ్చి, కుంభకోణం, కారైక్కుడి, పుదుకోట, సేలం, ధర్మపురి, పొల్లాచ్చి, ఈరోడ్, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, మదురై, దిండుగల్, విరుదునగర్ తదితర ప్రాంతాల్లోని కేంద్రాల్లో శిక్షణ అందించనున్నారు. అభ్యర్థులు 20 ఏళ్ల పూర్తయి, తమిళం మాట్లాడడం, అర్థం చేసుకునే నైపుణ్యం, లైట్ వెహికల్ లైసెన్స్ కలిగి ఒక సంవత్సరం పూర్తయి, పీఎస్‌వీ బ్యాడ్జ్ కలిగి ఉండాలి. 65 రోజుల శిక్షణలో చేరేందుకు ఆసక్తి ఉండి అర్హత కలిగిన మహిళలు https://www.tnskill.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో ఆగస్టు 20వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

టాస్మాక్ సిబ్బందికి రూ.2వేల వేతనం పెంపు

టి.నగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ సిబ్బంది జీతం రూ.2000 పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. రాష్ట్రమంతటా టాస్మాక్ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఏప్రిల్ నుండి రూ.2000 వేతనం పెంచనున్నట్టు ఇటీవల శాసనసభలో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. అయితే మూడు నెలల దాటినా వేతనాల పెంపు అమలు చేయలేదని టాస్మాక్ ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో టాస్మాక్ మద్యం దుకాణాలలో పనిచేస్తున్న సిబ్బంది వేతనాలు రూ.2000ల వరకు పెంచినట్లు ఆ సంస్థ ఓ ప్రకటన జారీ చేసింది. ఈ పెంచిన వేతనాలు ఏప్రిల్ ఒకటి నుండే వర్తిస్తాయని ప్రకటించింది. అదే సమయంలో మద్యం సీసాలను అదనంగా రూ.10ల దాకా పెంచి విక్రయించి సంస్థ నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న టాస్మాక్ సిబ్బంది 451 మందికి మాత్రం రూ.1000ల వరకే వేతనం పెరుగుతుందని సంస్థ స్పష్టం చేశారు.

ఘనంగా కామరాజర్ జయంతి



ఎస్‌కేపీడీలో కామరాజర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కరస్పాండెంట్ ఎస్ఎల్ సుదర్శనం, ఏఎస్పీ శ్రీనివాసరావు తదితరులు



కేసరి పాఠశాలలో విద్యార్థులతో కలిసి కామరాజర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాగుల గోపాలయ్య

ప్యారీస్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లోని కేసరి మహోన్నత పాఠశాలలో మంగళవారం తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగుల గోపాలయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యాక్రమంలో పాఠశాల విద్యార్థులతో కలిసి కామరాజర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం నాగుల గోపాలయ్య మాట్లాడుతూ... కామరాజర్ జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారని, కఠిన పరిస్థితుల మధ్య ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి, తమిళనాడు రాష్ట్ర అభివృద్ధికి ఎంతగానో పాటుపడ్డారన్నారు. ఆ మహనీయుడి ఆయన జయంతి వేడుకలు జరుపుకోవడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌కేపీడీలో...

ప్యారీస్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్యారీస్ గోవిందప్పనాయకన్ వీధిలోవున్న ఎస్‌కేపీడీ బాలుర మహోన్నత పాఠశాలలో దివంగత మాజీముఖ్యమంత్రి కామరాజర్ 123వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం విద్యాదినోత్సవాన్ని జరుపుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ ఎస్ఎల్ సుదర్శనం, ఎస్‌కేపీడీ ట్రస్టీ ఊటుకూరు శరత్‌కుమార్, ముఖ్యఅతిథి ఏఎస్పీ శ్రీనివాసరావు, గౌరవ అతిథి రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై జెమినీ మాజీ అధ్యక్షుడు వెంకట కృష్ణన్, ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ ట్రజరర్ సుజాత రమేష్‌బాబు, ప్రధానోపాధ్యాయురాలు ఓరుగంటి లీలారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు కామరాజర్ చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు.

పెళ్లయిన నెలరోజులకే... నూరేళ్లు నిండాయి

● భార్యతో సినిమా చూస్తూ యువకుడి మృతి

పెరంబూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కొత్తగా పెళ్ళయి సినిమా థియేటర్‌లో భార్యతో కలిసి సినిమా చూస్తున్న వరుడు హఠాత్తుగా గుండెపోటుతో మృతిచెందిన ఘటన స్థానిక మందవెల్లిలో చోటుచేసుకుంది. మందవెల్లి ఎస్బీఐ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న మెల్విన్ (29) ఎగ్మూర్‌లో ఉన్న ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. మెల్విన్‌కు నెల రోజుల క్రితం పట్టిణంబాక్కంకు చెందిన గాయత్రితో వివాహమైంది. ఘటన జరిగిన రోజు నవ దంపతులు పాత మహాబలిపురం రోడ్డు సమీపంలోని మెరీనా మాల్‌కు వెళ్లారు. మాల్ ప్రాంగణంలో థియేటర్‌లో నవదంపతులు సినిమా చూస్తున్న సమయంలో, మెల్విన్ హఠాత్తుగా శ్వాసతీసుకోలేక ఇబ్బంది పడ్డారు. సిబ్బంది అతడిని వెంటనే సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే అతను గుండెపోటుకు గురై మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయం విన్న గాయత్రి స్పృహ తప్పి పడిపోవడంతో అదే ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకుని అక్కడకు చేరుకున్న కేలంబాక్కం పోలీసులు, మెల్విన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెంగల్పట్టు ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పార్ట్ టైం ఉపాధ్యాయుల అరెస్ట్

పెరంబూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళన చేపట్టిన పార్ట్ టైం ఉపాధ్యాయులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఉద్యోగాల క్రమబద్ధీకరణ సహా పలు డిమాండ్ల సాధనకు పార్ట్ టైం ఉపాధ్యాయులు విడతల వారీగా ఆందోళనలు చేపడుతున్నారు. గత ఎన్నికల ప్రచారంలో డీఎంకే ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్న పార్ట్ టైం ఉపాధ్యాయులు, స్థానిక నుంగంబాక్కంలోని డీపీఐ కార్యాలయంలో సమీపంలో ఆందోళనలు చేపట్టారు. మంగళవారం జరిగిన ఆందోళనలో పాల్గొన్న 200 మంది ఉపాధ్యాయులను అరెస్ట్ చేసి సమీపంలోని కల్యాణ మండపానికి తరలించిన పోలీసులు, సాయంత్రం 5 గంటలకు వారిని వదిలిపెట్టారు.

● లాకప్‌డెత్ కేసు...

ఐదుగురు పోలీసుల రిమాండ్ పొడిగింపు



పెరంబూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అజిత్‌కుమార్ లాకప్ డెత్ కేసులో అరెస్టయిన ఐదుగురు పోలీసులు రిమాండ్‌ను న్యాయస్థానం పొడిగించింది. శివగంగ జిల్లా మడప్పురం భద్రకాళి అమ్మవారి ఆలయ వాచ్‌మన్‌ను, నగల చోరీ కేసులో విచారించేందుకు పోలీసులు తీసుకువెళ్లగా తీవ్రగాయాలతో మృతిచెందాడు. అజిత్ కుమార్‌పై దాడి వ్యవహారంలో ప్రత్యేక దళం పోలీసులు కన్నన్, ప్రభు, ఆనంద్, రాజా, శంకర్ మణికంఠన్ తదితరులను అరెస్ట్ చేసి మదురై సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ కేసు హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ విచారిస్తున్న నేపథ్యంలో, ఈ కేసు రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో, ఈ కేసు విచారణ మంగళవారం తిరుభువనం క్రిమినల్ కోర్టులో జరిగింది. విచారణకు మదురై జైలు నుంచి ఐదుగురు పోలీసులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపరిచారు. అనంతరం ఐదుగురి రిమాండ్ ఈ నెల 30వ తేది వరకు పొడిగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

బ్యాడ్మింటన్ శిక్షణలో ఐటీ ఉద్యోగి మృతి



మృతుడు మోహన్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బ్యాడ్మింటన్ శిక్షణ పొందుతున్న ఐటీ ఉద్యోగి గుండెపోటుతో మృతిచెందిన ఘటన విషాదానికి దారితీసింది. నగరంలో ఓ ఐటీ కంపెనీలో పనిచేస్తున్న మోహన్ (26): కోడంబాక్కంలోని అకాడమీలో ప్రతిరోజు బాడ్మింటన్ శిక్షణకు వెళ్తున్నాడు. ఘటన జరిగిన రోజున శిక్షణ పొందుతున్న మోహన్, హఠాత్తుగా స్పృహతప్పి పడిపోయాడు. సహచర క్రీడాకారులు అతనిని సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రూ.50 లక్షలతో ఉద్యోగి పరార్

అడయార్, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్థానిక తేనాంపేట, గిరియప్పాసాలైలో ఏటీఎం కేంద్రాల్లో నగదు నింపే వ్యవహారాలు సీఎంఎస్ ఇన్ఫోటెక్ అనే కంపెనీ చేస్తోంది. ఈ కంపెనీలో పనిచేసే ఓ ఉద్యోగి రూ.50 లక్షలతో పారిపోయాడు. కంపెనీ మేనేజర్ కార్తీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

నా ప్రాణాలకు ముప్పు!

● పోలీసులకు ఫిర్యాదు చేసిన టీవీకే నేత

చెన్నై, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తన ప్రాణాలకు ముప్పువాటిల్లే అవకాశాలున్నాయంటూ తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఎన్నికల విభాగం ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జునా టి.నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదవ్ అర్జునా కార్యాలయం ఆళ్వార్‌పేటలో ఉంది. ఇటీవల కొందరు ఆటోలో మారణాయుధాలతో వచ్చి చాలా సేపటి వరకూ తన కార్యాలయం వైపు చూస్తూ వెళ్ళారు. దీంతో తన ప్రాణాలు ముప్పువాటిల్లుతుందేమోనని అనుమానిస్తున్నట్లు ఆయన పోలీసులకిచ్చిన ఫిర్యాదులో ఆరోపించారు.

పెండింగ్ కేసుల పరిష్కారంపై అవగాహన ప్రచారం



అవగాహన ప్రచార ర్యాలీలో న్యాయమూర్తులు, న్యాయవాదులు

ప్యారీస్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు, దిగువ కోర్టుల్లో పెండింగ్‌లోవున్న కేసుల పరిష్కరింపజేయడంపై అవగాహన కల్పించేలా రాష్ట్ర మధ్యవర్తిత్వ కేంద్రం ఆధ్వర్యంలో మద్రాస్ హైకోర్టు ప్రాంగణంలో ప్రచార ర్యాలీ ప్రారంభమైంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్, న్యాయమూర్తి సూర్యకాంత్ సూచన మేరకు మద్రాస్ హైకోర్టు ప్రాంగణంలోని రాష్ట్ర మధ్యవర్తిత్వ కేంద్రం 90 రోజులు అవగాహన ప్రచారం చేయనుంది. రాష్ట్రంలోని వివిధ కోర్టుల్లో పెండింగులో ఉన్న కేసుల విచారణ జాప్యం, అనవసర ఖర్చు లేకుండా సామరస్యంగా ఆ కేసులను పరిష్కరించాలన్న లక్ష్యంతో ఈ ప్రచార ర్యాలీని ఆ కేంద్రం డైరెక్టర్ బాలసుబ్రమణ్యన్ సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా న్యాయస్థానాల్లో విడాకుల కేసులు, వివాహ సమస్యలు, కుటుంబం కలహాలు, ప్రమాదాలకు సంబంధించిన నష్టపరిహారం, ఫోర్జరీ తదితర కేసులను సామరస్యంగా త్వరితగతిన పూర్తిచేయాలని కోరుతూ తమ కేంద్రం తరుపున 90 రోజుల పాటు ఈ ప్రచార ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. పిటిషన్లు వేసి కోర్టుల చుట్టూ తిరుగుతున్న ప్రజలు, న్యాయవాదులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రచార ర్యాలీలో హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగానికి కామరాజర్ చేసిన సేవలు చిరస్మరణీయం



విద్యార్థులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, పాఠశాల నిర్వాహకులు

తిరుత్తణి, జూలై 15(ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు పంచాయతీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కామరాజర్ 123వ జయంతిని పురస్కరించుకుని విద్యాదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెండో తరగతి చదువుతున్న బాలలకు పూల మాలలు వేసి సత్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీడీవో అర్పుదరాజ్ మాజీముఖ్యమంత్రి కామరాజర్ విద్యారంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఆయన ప్రవేశపెట్టిన పథకాల ద్వారానే విద్యారంగంలో పలు మార్పులు వచ్చాయని కొనియాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్ముగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తిరుత్తణిలో....



కామరాజర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వినోద్ తదితరులు

తిరుత్తణి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో దివంగత మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ 123వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సమాజ సేవకుడు వినోద్ అధ్యక్షతన ఈ కార్యక్రమంలో తిరుత్తణిలోని కామరాజర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టి, మధ్యాహ్నం పేదలకు అన్నదానం చేశారు.. ముత్తురాజ్, రాజశేఖర్, పళని, శివసుబ్రమణ్యం, బాలాజీ, మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.

2,338మంది డిగ్రీ టీచర్ల బదిలీ

పెరంబూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కౌన్సెలింగ్ ద్వారా 2,388మంది డిగ్రీ టీచర్లు కోరుకున్న పాఠశాలలకు బదిలీ అయ్యారని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విడుదల చేసిన ప్రకటనలో... ప్రస్తుత విద్యా సంవత్సరం ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్ ఈ నెల 1న ప్రారంభమైంది. డిగ్రీ టీచర్లకు అంతర్ జిల్లాల బదిలీ కౌన్సెలింగ్ సోమవారం జరిగింది. అందులో మొత్తం 11,163 మంది హాజరుకాగా, వారిలో 2,388 మంది తాము కోరుకున్న పాఠశాలలకు బదిలీ అయినట్లు విద్యాశాఖ తెలిపింది.

స్వాతంత్ర సమరయోధులకు సత్కారం



స్వాతంత్ర సమరయోధుడిని సత్కరిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ నేతలు చిరంజీవి, సురేష్‌బాబు తదితరులు

ప్యారీస్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ 123వ జయంతి స్థానిక చూలై ప్రాంతంలో మంగళవారం జరిగాయి.. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) కార్యదర్శి పి.సురేష్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె.చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉపాధ్యక్షులు గోపన్న, పొన్ కృష్ణమూర్తి, మెల్విన్ సామ్యూల్, గోల్డెన్ రఫి తదితరుల సమక్షంలో స్వాతంత్ర సమరయోధుడిని గౌరవించి, పార్టీ సీనియర్లు పలువురికి కామరాజర్ అవార్డులు ప్రదానం చేసి జ్ఞాపికలతో సత్కరించారు.

3 నుంచి ప్రేమలత ప్రచార పర్యటన



టి.నగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత ఆగస్టు 3 నుండి అసెంబ్లీ ఎన్నికల తొలివిడత ప్రచార యాత్ర ప్రారంభించనున్నారు. పార్టీ తిరువళ్లూరు తూర్పు జిల్లాశాఖలోని ఆరంబాక్కం వినాయకుడి ఆలయం నుంచి ప్రచారయాత్ర ప్రారంభించి గుమ్మిడిపూండి తదితర ప్రాంతాల్లో రోడ్‌షోలు నిర్వహించనున్నారు. ఆగస్టు 4న ఆవడిలో పోలింగ్ బూత్ ఏజెంట్లతో ఆమె భేటీ అవుతారు. అదే రోజు సాయంత్రం తిరుత్తణిలో, మరుసటి రోజు ఉదయం కాంచీపురంలో బూత్ ఏజెంట్లతో సమావేశమై, సాయంత్రం రాణిపేట, షోళింగనల్లూరులో ప్రచారం నిర్వహిస్తారు. ఆగస్టు 23 వరకు ఆమె పలు జిల్లాల్లో పర్యటిస్తారని ఆ పార్టీ ఓ ప్రకటనలో పేర్కొంది.

పన్ను విధింపులో గోల్‌మాల్

● బిల్ కలెక్టర్ సహా 8 మంది సస్పెన్షన్

అడయార్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మదురైలో పన్ను విధించే ప్రక్రియలో జరిగిన గోల్‌మాల్ వ్యవహారంలో బిల్ కలెక్టర్ సహా 8 మందిని మదురై కార్పొరేషన్ కమిషనర్ సస్పెండ్ చేశారు. వాణిజ్య పన్ను విధింపులో గోల్‌మాల్ జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. దీంతో కమిషనర్ సారథ్యంలో అధికారుల బృందం విచారణ జరిపింది. ఇందులో పన్ను విధింపులో అక్రమాలు జరిగినట్టు తేలింది. 2022, 2023లో వాణిజ్య భవనాలకు పన్ను వేయడంలో అంచనాలు తక్కువగా వేసి, కార్పొరేషన్‌కు రూ.150 కోట్ల మేర నష్టం కలిగించినట్టు తేలింది. దీనికి కారకులైన రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్, అసిస్టెంట్ రెవెన్యూ అధికారి సహా మొత్తం 8 మంది హస్తం ఉన్నట్టు తేలడంతో వారిని అరెస్టు చేశారు. మరో 55 మంది అధికారుల జాబితా సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో ఐదుగురు బిల్ కలెక్టర్లతో పాటు మొత్తం ఎనిమిది మందిని కమిషనర్ సస్పెండ్ చేశారు.

నటుడు రవి మోహన్‌కు హైకోర్టు నోటీసు

ప్యారీస్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రెండు చిత్రాల్లో నటించేందుకు అడ్వాన్సుగా రూ.6 కోట్లు తీసుకున్న వ్యవహారంలో అఫిడవిట్ దాఖలు చేయాల్సిందిగా నటుడు రవి మోహన్‌కు హైకోర్టు నోటీసు జారీ చేసింది. బాబీ టచ్ గోల్డ్ యూనివర్సల్ అనే సంస్థ డైరెక్టర్ బాలచంద్రన్ దాఖలు చేసిన పిటిషన్‌లో, తమ సంస్థ తరుపున నిర్మించదలిచిన రెండు చిత్రాల్లో నటించేందుకు రవి మోహన్‌తో 2024 సెప్టెంబర్‌లో ఒప్పందం కుదుర్చుకుని అడ్వాన్సుగా రూ.6కోట్లు చెల్లించామని, అయితే ఆయన ఒప్పందాన్ని ఉల్లంఘించాడని ఆరోపించారు. ఈ నేపథ్యంలో అడ్వాన్సు నగదు తిరిగివ్వాలని కోరగా రవి మోహన్ నగదు చెల్లించకుండా కాలయాపన చేశారని తెలిపారు. తమ వద్ద తీసుకున్న నగదుతో రవి మోహన్ తన సొంత బ్యానర్‌తో చిత్ర నిర్మాణ సంస్థ ప్రారంభించి నిర్మించిన బ్రోకోర్ చిత్రంపై స్టే విధించాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌ను మంగళవారం విచారణకు స్వీకరించిన హైకోర్టు పిటిషన్‌కు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని రవి మోహన్‌ను ఆదేశించి తదుపరి విచారణను ఈ నెల 25కి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అంబత్తూర్: వెళ్లలార్ నగర్, స్కూల్ వీధి, అచ్చి వీధి, పదసాలై వీధి, ఈటేశ్వరన్ ఆలయ వీధి, వైష్ణవి నగర్, కామరాజర్ నగర్

సైదాపేట: కట్టబొమ్మన్ బ్లాక్, ముత్తురంగన్ బ్లాక్, అంజుగం నగర్, పారీ నగర్, స్కూల్ వీధి, ఆర్ఆర్ కాలని అన్ని వీధులు, వీఎస్ఎం గార్డన్, భారతి బ్లాక్, ఏరికరై వీధి, సైదాపేట వెస్ట్ ఏరియా, 7,11 అవెన్యూలు, ఎల్ఐసీ కాలనీ, నాగాత్తమ్మన్ ఆలయ వీధి, అన్నామలై చెట్టి నగర్, ఎతిరాజ్ నగర్, వీకే కాలని 1 నుంచి 5 వీధులు, పోస్టల్ కాలని 1 నుంచి 4 వీధులు, కామాక్షిపురం 11వ వీధి, 10వ అవెన్యూ, అశోక్ నగర్ 58 నుంచి 64 వీధులు, నాయికమ్మార్ వీధి, మూవేందర్ కాలని, అశోక్‌నగర్ కొంత భాగం, పిళ్లయార్ ఆలయ వీధి, శేఖర్ నగర్, వెస్ట్ జోన్స్ రోడ్డు, అశోక్ నగర్ 12వ అవెన్యూ, రామాపురం రామస్వామి వీధి, రాజగోపాల్ వీధి, ఆంజనేయ ఆలయ వీధి, రామానుజం వీధి, భారతియార్ వీధి, మస్న్యాపల్లం, ధనశేఖరన్ వీధి, వీజీపీ రోడ్డు

తరమణి: కామరాజ్ నగర్, రాజ్యలక్ష్మి అవెన్యూ, టెలిఫోన్స్ నగర్, వీపీకే వీధి, వెంకటేశ్వర నగర్, కురింజి నగర్

పట్టాభిరామ్: సేక్కాడు, అయ్యప్పన్ నగర్, శ్రీదేవి నగర్, తండురై, కన్నపాళయం, గోపాలపురం, వీజీవీ నగర్, వీజీఎన్ నగర్

కారంబాక్కం: సమయపురం, శ్రీరామ్ నగర్, గాంధీ నగర్, కందస్వామి నగర్, పొన్ని నగర్, మోతి నగర్, పద్మావతి నగర్, కావేరి నగర్, ధర్మరాజ నగర్, విశ్వనాధన్ వీధి, బీరమనార్ వీధి

అరుంబాక్కం: 100 అడుగుల రోడ్డు, జాయ్ నగర్ 17,18,21,22,23 వీధులు, జాయ్ నగర్ 2వ మెయిన్ రోడ్డు, వళ్లువర్ రోడ్డు, అమరావతి నగర్, ఎస్‌వీపీ నగర్, జగన్నాధన్ నగర్ 2వ మెయిన్ రోడ్డు, పెరుమాళ్ ఆలయ గార్డన్, రామకృష్ణ వీధి

ఎవరు తప్పుచేసినా శిక్షించగల నేత సీఎం స్టాలిన్

● మంత్రి రఘుపతి

పెరంబూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తప్పు ఎవరు చేసినా, సొంత పార్టీ సభ్యులైనా శిక్షించగల నేత ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అని న్యాయశాఖ మంత్రి రఘుపతి కితాబిచ్చారు. పుదుకోటలో మంగళవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... అన్నాడీఎంకే-బీజేపీ కూటమిలో పలు వైరుధ్యాలున్నాయన్నారు. ఇప్పటికే రెండు పార్టీల మధ్య సఖ్యత లేదన్నారు. నేను ముఖ్యమంత్రి అభ్యర్థిని అని ఈపీఎస్ చెబుతుండగా, ముఖ్యమంత్రి అభ్యర్థిని కూటమి నేతలు నిర్ణయిస్తారని బీజేపీ చెబుతోందన్నారు. అలాగే, రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటవుతుందని కేంద్ర మంత్రి అమిత్ షా చెబుతుండగా, అన్నాడీఎంకే అధికారం చేపడుతుందని ఈపీఎస్ పేర్కొంటున్నారన్నారు. ఎన్నికల సమయంలోనే అన్నాడీఎంకేకు ప్రజలు గుర్తుకొస్తారని, తాజాగా ప్రచారం సాగిస్తున్న ఈపీఎస్, డీఎంకే మహిళలకు అందిస్తున్న రూ.1,000, తాము అధికారంలోకి వస్తే రూ.1,500 చేస్తామని కల్లబొల్లి మాటలు చెబుతున్నారని ఆరోపించారు. డీఎంకే పాలనలో నేరస్తులు తప్పించుకొనేందుకు వీలులేదని, తప్పు చేసిన వ్యక్తి ఏ పార్టీకి చెందిన శిక్ష పడాల్సిందేనని సీఎం ఆలోచన అన్నారు. ఆ క్రమంలోనే అన్నా వర్శిటీ లైంగిక కేసులో 5 నెలల్లోనే తీర్పు వెలువడిందని మంత్రి రఘుపతి గుర్తుచేశారు.

అమెరికా వెళ్లేందుకు అనుమతించాలని సెంథిల్ బాలాజీ సోదరుడి పిటిషన్

● ఈడీకి హైకోర్టు ఉత్తర్వు



అశోక్‌కుమార్, సెంథిల్ బాలాజీ

ప్యారీస్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం అమెరికా వెళ్ళేందుకు అనుమతి కోరుతూ మాజీమంత్రి సెంథిల్ బాలాజీ సోదరుడు అశోక్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటర్ అఫిడవిట్ వేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని ఆదేశిస్తూ మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. గుండె సమస్యతో బాధపడుతున్న అశోక్‌కుమార్ చికిత్స కోసం అమెరికా వెళ్ళేందుకు అనుమతి కోరుతూ గతంలో దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు తోసిపుచ్చింది. దీనిని వ్యతిరేకిస్తూ అశోక్‌కుమార్ తరుపున హైకోర్టులో అప్పీలు పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ న్యాయమూర్తులు ఎంఎస్ రమేష్, వి.లక్ష్మీనారాయణతో కూడిన ధర్మాసనం ముందుకు విచారణకు రాగా, పిటిషనర్ తరుపు న్యాయవాది సత్యన్ 15 రోజులకు మాత్రమే అనుమతిస్తే చాలని, న్యాయస్థానం విధించే నిబంధనలకు కట్టుబడి ఉంటామని తెలిపారు. జోక్యం కలుగజేసుకున్న న్యాయమూర్తుల బెంచ్, అమెరికాలో మీరు ఎక్కువ రోజులుండాలనుకున్నా ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ అనుమతించరని చమత్కార ధోరణిలో సూచించారు. పిటిషన్‌పై అఫిడవిట్ దాఖలు చేసేందుకు అవకాశం కావాలని ఈడీ తరుపు న్యాయవాది రజనీస్ కోరారు. ఇరు తరుపు వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తుల బెంచ్, అశోక్‌కుమార్ పిటిషన్‌పై అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ ఈ కేసు విచారణను ఈ నెల 25కు వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

సేలంలో కరుణానిధి విగ్రహానికి కళంకం

● నలుపు రంగు పూసిన దుండగులు



విగ్రహంపై ఉన్న పెయింట్‌ను తొలగిస్తున్న కార్మికులు, విగ్రహం ముందు గుమికూడిన స్థానికులు

చెన్నై, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సేలంలో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి విగ్రహంపై గుర్తు తెలియిన దుండగులు నలుపు పెయింట్ పోసి కళంకపరిచారు. మంగళవారం వేకువజాము ఆ ప్రాంతంలో పాదచారులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులను పిలిపించి ఆ విగ్రహంపైనున్న పెయింట్‌ను తొలగించారు. సేలం అన్నా పార్కు ముందున్న కరుణానిధి కాంస్య విగ్రహం నడుము, కాలిభాగంపై సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు నలుపు పెయింట్ పోసి పారిపోయారు. మంగళవారం వేకువజామున కరుణ విగ్రహంపై పెయింట్ ఉండటాన్ని గమనించిన స్థానికులు దిగ్భ్రాంతి చెందారు. ప్రస్తుతం ఆ విగ్రహ ప్రాంతం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ ఆధారంగా విగ్రహంపై రంగు పూసిన దుండగుల ఆచూకీని కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నారు.

తాగునీటి పైపులను బాగు చేయండి

● అధికారులకు కోడివలస వాసుల విజ్ఞప్తి



వాహనాలు ఆపి నిరసన తెలుపుతున్న మహిళలు

తిరుత్తణి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకాలోని కోడివలసలో మరమ్మతులకు గురైన తాగునీటి పైపులను బాగు చేయమంటూ స్థానిక మహిళలు మంగళవారం ఉదయం రోడ్డుపైకి వచ్చి నిరసన తెలియజేశారు. స్థానికుల సమాచారం మేరకు కొన్ని రోజులుగా అతిమాంజేరిపేటలో విరిగిన నీటి పైపులైన్ కారణంగా తమ గ్రామానికి తాగునీటి సరఫరా నిలిచిపోయిందని, అధికారులకు ఫిర్యాదు చేస్తే స్పందించలేదన్నారు. దీంతో అక్కడి మహిళలు బిందెలతో రెవెన్యూ కార్యాలయం వద్ద రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి అధికారులతో మాట్లాడి సత్వర చర్యలు తీసుకుంటామని పోలీసుల హామీ ఇవ్వడంతో మహిళలు నిరసన విరమించారు.

డీఎంకేకు వ్యతిరేకంగా అన్నాడీఎంకే నేతల ధర్నా



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీమంత్రి జయకుమార్ తదితరులు

తిరుత్తణి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): డీఎంకేకు పాలనకు వ్యతిరేకంగా అన్నాడీఎంకే నేతలు సోమవారం సాయంత్రం తిరుత్తణిలో ధర్నా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీమంత్రి జయకుమార్ మాట్లాడుతూ ఈ నాలుగేళ్ళ అధికారంలో డీఎంకే ప్రభుత్వం సాధించింది ఏదీలేదని విమర్శించారు. తిరుత్తణి నియోజకవర్గ పరిధిలో ఎన్నో సమస్యలున్నాయని, హాస్టళ్లలో విద్యార్థులకు కనీస వసతులు లేవన్నారు. అదేవిధంగా పోదటూరుపేటలోని పేద కుటుంబాలకు ఇళ్లపట్టాలు పంపిణీ చేయడంతో పాటు, తిరుత్తణి మురుగన్ ఆలయానికి ప్రత్యేక రోడ్డు పనులు తదితర అభివృద్ధి పనులు మరుగున పడ్డాయన్నారు.

బీఐఎస్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా మీనాక్షి గణేశన్



టి.నగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) సదరన్ జోన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా ప్రముఖ శాస్త్రవేత్త మీనాక్షి గణేశన్ బాధ్యతలు స్వీకరించారు. చెన్నై లోని బీఎస్ఐ దక్షిణ మండల కార్యాలయం పరిధిలో తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, గోవా రాష్ట్రాలు అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప ప్రాంతాలున్నాయి. ఈ కార్యాలయంలో సదరన్ జోన్ డిప్యూటీ జనరల్‌గా పనిచేసిన ప్రవీణ్‌ఖన్నా ఢిల్లీకి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ప్రముఖ శాస్త్రవేత్త మీనాక్షి గణేశన్ ఆ పదవిలో నియమితులయ్యారు. సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీ, గోవా, కొచ్చిన్, హైదరాబాద్, చెన్నై కార్యాలయాలలో పలు పదవులు పొంది 30 యేళ్లుగా సేవలందించిన మీనాక్షి.. సదరన్ జోన్ డిప్యూటీ జనరల్‌గా పదవీబాధ్యతలు స్వీకరించిన తొలి మహిళ కావడం విశేషం.

ఫిలిప్పైన్స్ యువతితో తమిళ యువకుడి ప్రేమ వివాహం



అఖిలరసన్ మెడలో పూలమాల వేస్తున్న వధువు కేథియా జేడ్

చెన్నై, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడి ఏడేళ్లపాటు ప్రేమించిన ఫిలిప్పైన్స్ యువతి, వేదారణ్యం తమిళ యువకుడు ఎట్టకేలకు ఒక్కటయ్యారు. తమిళ సంప్రదాయం ప్ర కారం జరిగిన ఈ ప్రేమ వివాహానికి ఇరువైపు బంధువులు హాజరై ఆశీర్వదించారు. నాగపట్టినం సమీపం వేదారణ్యం చేరువగా ఉన్న పంచనదికుళం ప్రాంతానికి చెందిన అఖిలరసన్ అనే యువకుడు ఇంజనీరింగ్ చదివి సింగపూరులో పనిచేస్తుండగా ఫేస్‌బుక్ ద్వారా ఫిలిప్పైన్స్‌కు చెందిన క్రైస్తవ యువతి కేథియా జేడ్‌తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఏడేళ్లపాటు వీరి ప్రేమ వ్యవహారాలు కొనసాగటంతో ఇరువైపు బంధువులకు ఆ సమాచారం తెలిసి వీరి ప్రేమ వివాహానికి పచ్చజెండా ఊపేశారు. దీంతో మంగళవారం ఉదయం పంచనదికుళంలో హిందూ సంప్రదాయం ప్రకారం వారి వివాహం బంధు మిత్రుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది.

అలరించిన 'ప్రవల్లిక' భరతనాట్య ప్రదర్శన



టీటీవీ అదనపు ఈవో పార్థసారథి, ప్రవల్లికను సత్కరిస్తున్న రోజా రాణి

పెరంబూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సమాచార కేంద్రంలో ప్రవల్లిక భరత నాట్య ప్రదర్శన ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది. శ్రీ భారత్ కళా ఆర్ట్స్ అకాడమీ నాట్య గురువు రోజా రాణి, వ్యవస్థాపక డైరెక్టర్ దుర్గా నటరాజన్ ఆధ్వర్యంలో టీటీడీ సమాచార కేంద్రంలోని శ్రావణ హాలులో జరిగి ఈ ప్రదర్శనలో ప్రవల్లిక నాట్యంలో ప్రదర్శించిన హావభావాలు ఆకట్టుకున్నాయి. ఊత్తుకాడు వెంకటసుబ్బయర్ కీర్తనలు 'ఆనంత నర్తన గణపతిం...', 'అసైదదుం మాయిల్ ఒండ్రు...' లాల్గుడి జి.జయరామన్ కీర్తన, 'దేవర్ మునివర్....' కీర్తన, డాక్టర్ ఎం.బాలమురళికృష్ణ విరచిత కీర్తన 'కదనగుడుగళం తిల్లాన....' తదితర కీర్తనలకు ప్రవల్లిక చేసిన నాట్య ప్రదర్శన ప్రేక్షకులను మైమరపించింది. ప్రవల్లికను పద్మశ్రీ మీనాక్షి చిత్తరంజన్, టీటీడీ అదనపు ఈవో పార్థసారథి సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు.

20 నుంచి కుట్రాలంలో వేసవి వేడుకలు

పెరంబూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రం కుట్రాలంలో ప్రతి ఏడాది వేసవి వేడుకలు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది వేడులకు ఈ నెల 19 నుంచి 27వ తేది వరకు 9 రోజులు నిర్వహించనున్నట్లు జిల్లా యంత్రాంగం ఇదివరకు ప్రకటించింది. కానీ, నిర్వహణ కారణాలతో ఈ వేడుకలు 20వ తేది నుంచి ప్రారంభం కానున్నాయని అధికారులు తెలిపారు. వేడుకల్లో భాగంగా ఐందరువి పార్క్‌లో పుష్ప ప్రదర్శన 20 నుంచి 23వ తేది వరకు జరగనుంది. వేడుకల్లో భాగంగా సంప్రదాయ, జానపద నృత్యాలు, పలురకాల పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది.

'గ్లెనీగల్స్'లో అత్యాధునిక కంటి సంరక్షణ కేంద్రం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ సుధా శేషయ్యన్

చెన్నై, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన గ్లెనీగల్స్ హాస్పిటల్.. పెరుంబాక్కంలోని ప్రాంగణంలో 'గ్లెనీగల్స్ ఐ సెంటర్' ప్రారంభించింది. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్లాసికల్ తమిళ్ వైస్ చైర్మన్, శాస్త్ర విశ్వవిద్యాలయం డైరెక్టర్ డాక్టర్ సుధా శేషయ్యన్ ఈ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఐ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఇ.రవీంద్ర మోహన్, ఆసుపత్రి సీఈవో డాక్టర్ నాగేశ్వరరావు తదితరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధా శేషయ్యన్ మాట్లాడుతూ.. సాధారణ కంటి వ్యాధులే కాకుండా సంక్లిష్టమైన, అరుదైన కంటి రుగ్మతలను కూడా అద్భుతంగా పరిష్కరించే సదుపాయంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గ్లెనీగల్స్ ఐ సెంటర్ ప్రారంభ సంరక్షణ ప్రమాణాలను పెంచడంలో తమ నిరంతర నిబద్ధతను ప్రతిబింబిస్తుందని తెలిపారు.

అన్ని పాత్రలు అందరు హీరోలు చేయలేరు

● దర్శకుడు పాండిరాజ్

చిత్రజ్యోతి

అన్ని పాత్రలను అందరు హీరోలు చేయలేరని, కానీ ఒక్క విజయ్ సేతుపతి మాత్రం అన్ని పాత్రలను అవలీలగా పోషించగలరని దర్శకుడు పాండిరాజ్ పేర్కొన్నారు. ఆయన దర్శకత్వం వహించగా విజయ్ సేతుపతి, నిత్యామేనన్ జంటగా నటించిన చిత్రం 'తలైవన్ తలైవి' ఈ నెల 25వ తేదీన విడుదలకానుంది. సీనియర్ నిర్మాత ఎస్.త్యాగరాజన్ సమర్పణలో సత్యజ్యోతి ఫిలిమ్స్ పతాకంపై సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మించారు. ఇటీవల జరిగిన మూవీ ట్రైలర్ కార్యక్రమంలో నిర్మాత త్యాగరాజన్ మాట్లాడుతూ, 'మూడు తరాలుగా సినిమా నిర్మాణంలో కొనసాగుతున్నామని, అప్పటి నుంచి ఇప్పటివరకు ఆదరిస్తున్న ప్రేక్షకులకు, మీడియాకు ప్రత్యేక ధన్యవాదాలు. ఇది పక్కా ఫ్యామిలీ చిత్రం' అన్నారు. చిత్ర దర్శకుడు పాండిరాజ్ మాట్లాడుతూ, 'సాధారణంగా హీరో క్యారెక్టర్ అంటే.. దానికంటూ ఒక ప్రత్యేకత ఉంటుంది. కానీ, ఈ చిత్రంలో అలాంటిదేదీ లేదు. సినిమా చూస్తే మీరే గ్రహిస్తారు. 'ఆకాశ వీరన్' అనే పాత్రలో విజయ్ సేతుపతి మాత్రమే జీవించగలడు. అందుకే హీరోగా ఆయనను ఎంపికచేశాం' అన్నారు. హీరో విజయ్ సేతుపతి మాట్లాడుతూ, 'మూడు తరాలుగా చిత్ర నిర్మాణంలో కొనసాగుతున్న సత్యజ్యోతి వంటి సంస్థలో పనిచేడం గర్వంగా ఉంది. దర్శకుడు పాండిరాజ్ ఎప్పటినుంచో తెలుసు. హీరోయిన్ నిత్యామేనన్‌తో కలిసి ఇలాంటి కథలో నటిస్తామని ఊహించలేదు. ఒక సినిమా నిర్మించడమంటే వంట చేయడంతో సమానం. వంట పూర్తయ్యాక దాన్ని ఆరగించి ఎలా ఉందో చెప్పాల్సింది ప్రేక్షకులు, మీడియానే. సినిమా నిర్మాణంతో మా పని పూర్తవుతుంది. ఫలితం మీ చేతుల్లో ఉంది. దాని కోసం ఎదురు చూస్తున్నాం' అన్నారు. నిత్యామేనన్ మాట్లాడుతూ, 'ఈ చిత్రంలో నటించడం నా జీవితంలోనే ఎంతో సంతోషాన్ని ఆస్వాదిస్తున్నాను. ఈ సినిమా ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది' అన్నారు.



త్యాగరాజన్, విజయ్ సేతుపతి, నిత్యామేనన్, పాండిరాజ్ తదితరులు

'ఉసురే' ఆడియో రిలీజ్

శ్రీ కృష్ణ ప్రొడక్షన్స్ పతాకంపై మౌళి ఎం.రాధాకృష్ణన్ రూపొందిన చిత్రం 'ఉసురే'. హీరోగా టీజయ్ అరుణాచలం, హీరోయిన్‌గా జనని గుణశీలన్ నటించారు. యదార్థ సంఘటనలతో, సమాజంలో జరిగే కథను తెరపై ఆసక్తికరంగా చూపిస్తే తప్పకుండా విజయం సాధిస్తాయన్న నమ్మకంతో దర్శకుడు నవీన్ ఈ చిత్ర కథను అద్భుతంగా రూపొందించారు. ఆగస్టు ఒకటో తేదీ విడుదలకానున్న ఈ మూవీ ఆడియో విడుదల నగరంలో తాజాగా జరిగింది. ఈ ఫంక్షన్‌కు అతిథులుగా కోలీవుడ్ దర్శకులు సంఘం అధ్యక్షుడు ఆర్వీ ఉదయకుమార్, ప్రధాన కార్యదర్శి పేరరసు, హీరో మిర్చి శివ, దర్శకుడు సుబ్రమణ్య శివ, సంగీత దర్శకుడు సి.సత్య, లోకేష్ అజిల్స్, దర్శకుడు వాలీ తదితరులతో పాటు చిత్రం బృందం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్వీ ఉదయకుమార్ మాట్లాడుతూ, 'ఈ సినిమా ఖచ్చితంగా బాగా నిలుస్తుంది. సాధారణంగా టేకింగ్‌లో నాలుగు షాట్స్ చూస్తేనే దర్శకుడి ప్రతిభ తెలిసిపోతుంది.. ఖచ్చితంగా ప్రతి ఒక్కరికీ నచ్చి మెచ్చే మూవీగా నిలుస్తుంది' అన్నారు. హీరో మిర్చి శివ మాట్లాడుతూ, 'ఈ చిత్ర బృందాన్ని చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. ఈ మూవీ మేకర్ ఎమన్ జాతీయ అవార్డు గ్రహీత. డ్రీమ్ వారియర్ మంచి పంపిణీ సంస్థ. ఖచ్చితంగా ఇది ఒక విజయవంతమైన చిత్రంగా నిలుస్తుందన్నారు. హీరోయిన్ జనని మాట్లాడుతూ, 'కథను ఎలా వివరించారో అంతే అందంగా దర్శకుడు చిత్రాన్ని తెరకెక్కించారు. ఇందులో నటించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అన్నారు.



'ఉసురే' ఆడియో రిలీజ్ దృశ్యం

శివరాజ్ కుమార్ హీరోగా ద్విభాషా చిత్రం



కొత్త చిత్రం పోస్టర్ లుక్ రిలీజ్

ప్రముఖ శాండల్‌వుడ్ హీరో, 'కర్ణాటక చక్రవర్తి' డాక్టర్ శివరాజ్ కుమార్ హీరోగా తమిళ, కన్నడ భాషల్లో కొత్త చిత్రం తెరకెక్కుతోంది. ఇంకా పేరు పెట్టని ఈ చిత్రం పోస్టర్ తాజాగా రిలీజ్ చేశారు. 'ఇడి మిన్నల్ కాదల్' సినిమాతో అభిమానుల దృష్టిని ఆకర్షించిన బాలాజీ మాధవన్ దర్శకత్వం వహిస్తున్నారు. ద్విభాషా మూవీగా యాక్షన్ థ్రిల్లర్‌తో రూపొందిస్తున్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు సూరజ్ శర్మ, కృష్ణ కుమార్. పి.సాగర్ షా - శ్రీతిక్ మోషన్ పిక్చర్స్ పతాకంపై తెరకెక్కుతోంది. ఉత్కంఠభరితమైన స్క్రీన్‌ప్లే యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నామని దర్శకుడు బాలాజీ మాధవన్ వివరించారు. గత నాలుగు దశాబ్దాలుగా సినీ కెరీర్‌ను కొనసాగిస్తున్న శివరాజ్‌కుమార్ తొలిసారి అసిస్టెంట్ పోలీస్ ఇన్‌స్పెక్టరు పాత్ర పోషిస్తున్నారు. ఒక బస్సులో జరిగే క్రైమ్ ఇన్వెస్టిగేషన్ మూవీగా రూపొందిస్తున్నారు.

మంచి పాత్ర కోసం ఎదురు చూస్తున్నా

● రాశి

తాను సినిమాల్లో రీ ఎంట్రీ ఇచ్చానని మంచి పాత్రల కోసం ఎదురు చూస్తున్నట్టు ప్రముఖ నటి రాశి పేర్కొన్నారు. తాజాగా నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ 'నేను సినిమాల్లో సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించాను. మంచి కథల కోసం ఎదురు చూస్తున్నాను. నేను నిజ జీవితంలో కూడా పెద్ద మాటకారిని కాదు. నా స్వభావమే అలాంటిది. నేపు పోషించిన పాత్రలు కూడా ఆ కోవలోకే వస్తాయి. సినిమాకు నిర్మాత, దర్శకుడు, కెమెరామెన్, సంగీత దర్శకుడు ఎంతో ముఖ్యం. ఈ నలుగురు నాలుగు స్తంభాల్లాంటివారు. ఈ నాలుగు పిల్లర్లు బలంగా ఉంటే ఆ సినిమా కూడా అంత ఘన విజయం సాధిస్తుంది' అన్నారు.





● విద్యుత్‌బోర్డు నిర్ణయం

టి.నగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎలక్ట్రిక్ ఆటోలు, టాక్సీలకు బ్యాటరీల సదుపాయంతో కూడిన 500 ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని విద్యుత్ బోర్డు నిర్ణయించింది. ఆ మేరకు ప్రణాళికలకు కూడా సిద్ధం చేసింది. రాష్ట్రంలో పర్యావరణాన్ని పరిరక్షించే దిశగా ప్రస్తుత పర్యావరణ మార్పులు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి తగినట్లుగా స్థిరమైన నగర రవాణా సదుపాయాలను మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇదివరకే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు ప్రత్యేక విధివిధానాలతో ప్రత్యేక ప్రణాళికను 2023లోనే రూపొందించింది. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ రంగానికి రూ.50 వేల కోట్ల పెట్టుబడులు, 1.50లక్షల మందికి ఉద్యోగావకాశాలు సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆ మేరకు డిసెంబర్ వరకు ఎలక్ట్రిక్ వాహనాలకు రహదారి పన్ను మినహాయింపు, రిజిస్ట్రేషన్ ఫీజు, పర్మిట్ ఫీజు మినహాయింపు కొనసాగించాలని నిర్ణయించింది. అదే సమయంలో ఎలక్ట్రిక్ వాహనాల ఉపయోగాన్ని పెంచేందుకు ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసే సంస్థలకు పలు రాయితీలు కల్పించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో పలు చోట్ల ఛార్జింగ్ స్టేషన్లను రాష్ట్ర విద్యుత్ బోర్డు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయిస్తోంది. 2023లోనే తొమ్మిది ప్రాంతాల్లో ఛార్జింగ్ స్టేషన్ల నిర్మాణ పనులు ప్రారంభించగా, ఆ స్టేషన్లు త్వరలో వినియోగంలోకి రానున్నాయి. ఇదిలా ఉండగా చెన్నై నగరంలో మొట్టమొదటగా 120 ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్ర రవాణా సంస్థ ప్రవేశపెట్టింది. డిసెంబర్ నెలాఖరునాటికి 625 ఎలక్ట్రిక్ బస్సులను నడపాలని ఆ సంస్థ కూడా నిర్ణయించింది. అదే సమయంలో వ్యక్తిగత ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని పెంచేందుకు, రవాణా సేవల్లో ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించడానికి చర్యలు చేపడుతున్నారు. ఆ ప్రకారమే కాలుష్యరహిత, స్థిరమైన నగర రవాణా సదుపాయాలను ప్రోత్సహించే దిశగా తమిళనాడు గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ డెవలప్‌మెంట్ పాలసీ (ఐటీడీపీ) మధ్య ఒక అవగాహన ఒప్పందం కూడా కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం ఐటీపీడీపీ కన్సల్టెన్సీ సేవలందిస్తుంది. తమిళనాడు గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ ఆ సలహాలకు కార్యరూపం కల్పించనుంది. ఈ ఒప్పందంలో... ముఖ్యమైన రంగాలలో ప్రజోపయోగం కోసం ఎలక్ట్రిక్ వెహికల్ ఛార్జింగ్ యాప్ అభివృద్ధిపరచడం, ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీలు, మార్కెట్ సమాచారాల కోసం ఒక సమగ్రమైన వెబ్‌సైట్‌ను రూపొందించడం, ఎలక్ట్రిక్ వాహనాల రవాణా పెంచేందుకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించడం వంటి అంశాలున్నాయి. ఈ విషయమై విద్యుత్‌బోర్డు ఉన్నతాధికారులు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, రహదారులలో 500 ప్రాంతాల్లో బ్యాటరీల మార్పిడి సదుపాయంతో కూడిన ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడానికి గల సాధ్యాసాధ్యాల అధ్యయనం చేస్తున్నామన్నారు. ప్రజారవాణాలో ఎలక్ట్రిక్ ఆటోలు, టాక్సీల సంఖ్య పెంచడానికి నగరాల్లో బ్యాటరీ ఎక్స్ఛేంజ్ స్టేషన్లు నెలకొల్పేందుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆ అధికారులు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న ప్రైవేట్ ఛార్జింగ్ స్టేషన్లలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి త్వరలో ప్రత్యేక ఫిర్యాదుల పరిష్కార కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్ బోర్డు ఉన్నతాధికారులు తెలిపారు.

నటి సంచితా శెట్టికి గౌరవ డాక్టరేట్

ఐసిఎఫ్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నటీమణి సంచితా శెట్టి, మెజెంటా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మేనేజింగ్ డైరెక్టర్ రాఖీ షా, తారా కేర్కర్‌కు ఆస్ట్రేలియాలోని సెయింట్ మదర్ థెరిసా యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. బ్రిటన్‌లోని కేంబ్రిడ్జ్ స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అనుబంధంగా వున్న ఈ యూనివర్శిటీ ఇటీవల కోవైలో జరిగిన కార్యక్రమంలో ఈ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. సామాజిక సమస్యలపై పోరాడటంతో పాటు వివిధ రంగాల్లో విశేష సేవలందించినందుకు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్ అందించినట్లు నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.



గౌరవ డాక్టరేట్లు అందుకున్న ప్రముఖులు



కడలూరు జిల్లా చిదంబరం ప్రభుత్వ బాలికల పాఠశాలలో మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ 123వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



చిదంబరం తాలూకా పేట్టై అంబేద్కర్‌నగర్‌లో పునర్నిర్మించిన అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

నేడు కందకోట్టమ్ ఆలయ కుంభాభిషేకం



సర్వాలంకరణశోభితుడైన ముత్తుకుమారస్వామి

చెన్నై, జూలై 15 (ఆంధ్రజ్యోత): స్థానిక ప్యారీస్‌కార్నర్ రాసప్పచెట్టి వీధిలోని కందకోట్టమ్ ముత్తుకుమారస్వామి ఆలయంలో బుధవారం మహా కుంభాభిషేకం జరుగనుంది. ఇటీవలే ఈ ఆలయ జీర్ణోద్ధరణ పనులు ముగిశాయి. ఈ నేపథ్యంలో కుంభాభిషేకం ముందస్తు పూజలు, హోమాలు ప్రారంభమయ్యాయి, ఈ నెల 10న కేల విఘ్నేశ్వర పూజ, గణపతి హోమం జరిగాయి. 11 ననుంచి 13వ తేదీ వరకు పలు పూజలు జరిగాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు కుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఆలయ రాజగోపురం, గర్భాలయ విమానంపై ఉన్న కలశాలపై పవిత్ర జలాలలతో సంప్రోక్షణ చేయనున్నారు. రాత్రి 8 గంటలకు ముత్తుకుమారస్వామివారి స్వర్ణమయూర వాహనంలో ఊరేగనున్నారు.



మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ 123వ జయంతి సందర్భంగా గిండీలోని స్మారక స్థలం వద్ద ఆయన విగ్రహానికి పూలమాలవేసి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి

● తిరువళ్లూర్ గూడ్సు ప్రమాదం...

నాలుగు మార్గాల్లో యధావిధిగా రైళ్లు



పెరంబూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్సు రైలు అగ్ని ప్రమాదానికి గురైన ప్రాంతంలో నాలుగు రైలు మార్గాల్లో మరమ్మతులు పూర్తికావడంతో, మంగళవారం ఉదయం నుంచి రైళ్ల రాకపోకలు యధావిధిగా ప్రారంభమయ్యాయి. హార్బర్ నుంచి 50 ట్యాంకర్లలో పెట్రోల్, డీజిల్ నింపుకుని ఆదివారం గూడ్సు రైలు తిరువళ్లూర్ రైల్వేస్టేషన్ సమీపంలో వెళుతుండగా భారీ అగ్ని ప్రమాదం జరిగింది. దీని కారణంగా, చెన్నై సెంట్రల్-అరక్కోణం మధ్య రైలు సేవలు నిలిపివేశారు. అగ్నిమాపక సిబ్బంది 11 గంటలు శ్రమించి మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం అగ్నికి ఆహుతైన బోగీలు, రైలు మార్గం, విద్యుత్ స్తంభాలు, వైర్లకు మరమ్మతులు చేపట్టారు.. నాలుగో రైలు మార్గంలో మరమ్మతులు పూర్తికావడంతో ఆదివారం వేకువజాము నుంచి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, మూడవ మార్గంలో సోమవారం ఉదయం నుంచి సబర్బన్ రైళ్లు నడిపారు. 1,2 లైన్లలో అగ్నికి ఆహుతైన ట్యాంకర్లు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లు, రైలు మార్గం మరమ్మతులు చేపట్టారు. సుమారు కి.మీ మేర రైలు మార్గం ధ్వంసం కావడంతో దాదాపు 400 మంది కార్మికులు, భారీ క్రేన్లతో మరమ్మతులు చేపట్టారు. సోమవారం సాయంత్రం 4.45 గంటలకు మూడో ట్రాక్‌లో మరమ్మతులు పూర్తయి, నాలుగో మార్గంలో పనులు చేపట్టిన సమయంలో, భారీ వర్షం కురవడంతో పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. వర్షం తగ్గడంతో మంగళవారం వేకువజామున నాలుగో ట్రాక్ మరమ్మతు పూర్తయింది. ఆ ప్రకారం, 46 గంటల అనంతరం మంగళవారం ఉదయం నుంచి తిరువళ్లూర్-అరక్కోణం మధ్య నాలుగు రైలు మార్గాల్లో సబర్బన్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల సేవలు యధావిధిగా సాగాయి.

ఆంధ్రజ్యోతి
బుధవారం
16 జూలై
2025
తమిళనాడు





దేశంలో ఉన్న పాముల జాతులు: 300, విషపూరితమైనవి: 60

అత్యంత విషపూరితం: ఇండియన్ కోబ్రా, నాగుపాము, రక్తపింజరి, కట్లపాము, గుడ్లపింజరి

శేషాచలంలో 35 రకాల పాములు

పా..పా..పాము!

ప్రమాదకరం కాదు

పాము కనిపించగానే ముందుగా ఒళ్లంతా పాములా జరజరా భయం పాకుతుంది. అది మీదకి వచ్చి కాటేసేస్తుందేమో అనే ఆందోళన కలుగుతుంది. విషపు కీటకం.. కొట్టి చంపేస్తేనే మేలు అనే అభిప్రాయానికి వస్తారు. కర్రతోనో, రాళ్లతోనో ఇక పాము మీద దాడి చేస్తారు. అది పారిపోయే ప్రయత్నం చేస్తుంది. దెబ్బ తగిలి తప్పించుకుంటే పాము పగబడుతుందనే నమ్మకంతో ఎట్లాగైనా చంపేయాలనే పట్టుదలతో పాము ప్రాణాలు తీసేస్తారు. ఆ తర్వాత మళ్లీ దానికి దహనక్రియలు చేస్తారు. పాలు పోస్తారు. దణ్ణం పెట్టుకుంటారు. దేవతగా ఒకవైపు పూజిస్తూనే కనిపిస్తే మాత్రం పామును కొట్టి చంపేసే విచిత్ర నైజం మనిషిది. మనిషిలోని భయమే పాము ప్రాణాలు తీస్తోంది. నిజానికి కనిపించేవన్నీ విషం కాదు. ఏది విషం, ఏది కాదు అని తెలిస్తే చాలు.. చాలా పాములు పాపం బతికిపోతాయి. ఈ రోజు స్నేక్ డే సందర్భంగా మన ప్రాంతంలో ఉండే పాములూ.. వాటి విశేషాలపై ప్రత్యేక కథనం..

ప్రత్యేక కథనం
మంగళం, ఆంధ్రజ్యోతి

శేషాచలం : తిరుమల శేషాచలం కొండల్లో 35 రకాల పాములు ఉన్నాయి. వీటిల్లో కొన్ని అరుదైన జాతులు. అవి.. ఇండియన్ సాండ్ స్నేక్ (ఎర్ర ఇసుకబోతు), నాగార్జునసాగర్ రేసర్ (బోలావతి), శ్రీలంకన్ ఫ్లయింగ్ స్నేక్(గాలిలో ఎగిరే పసిరిక పాము), సన్నని పడగపు పాము(ఇది అంతరించి పోతోంది). అయితే శేషాచలంలోని సర్పజాతులపై ప్రత్యేకమైన పరిశోధనలు ఏవీ ఇంత దాకా జరగనే లేదు. అందువల్లే ఉన్న 35 రకాల పాములకు సంబంధించిన పూర్తి సమాచారం కూడా అందుబాటులో లేదు.



కొండ చిలువ సైజు పెద్దదేగానీ విషం ఉండదు



విషపూరిత రక్త పింజర

మన సముద్ర జలాల్లో 16 రకాల పాములు

పాములు భూమ్మీద మాత్రమే కాదు సముద్రంలో కూడా ఉంటాయి. తరచూ మత్స్యకారుల వలల్లో పడుతుంటాయి. వీటిని తిరిగి నీళ్లలో వదిలేస్తుంటారు. తిరుపతి జిల్లాలో 16రకాల సముద్రపు పాములున్నాయని అంచనా. వీటిలో చాలా వరకు విషపూరితమైనవిగానే గుర్తించారు. తడ, వాకాడు, కోట సముద్ర తీర ప్రాంతాల్లో ఇవి మత్స్యకారులకు తారసపడుతుంటాయి. వాలుకుర్తిపాము, కస్తూరినాగపాము, హైడ్రోఫిష్ పాము, గలంగిరి, వాలగిరి, చంబాబు, నల్లదాసు పాములు ఎక్కువగా మన జిల్లాలోని సముద్ర జలాల్లో కనిపిస్తుంటాయి. అలాగే సముద్ర తీరంలోని ఇసుక ప్రాంతాల్లో ఇండియన్ సాండ్ బోవ(ఎరిక్స్ జోని), కాండనారస్, స్పాట్ సాండ్ స్నేక్ వంటి పాములు కనిపిస్తుంటాయి.ఇక తిరుపతి జిల్లాలో ఉన్న పులికాట్ సరస్సులో వానపాములు, సేతుపాములు మాత్రమే ఉంటాయి. ఇవి విషపూరితం కాదు. ఇక్కడి వానపాము (ఎర్ర) సైజు చాలా పెద్దదిగా ఉంటుంది. అందుకే పెద్ద ఎత్తున వీటిని సేకరించి స్మగుల్ చేస్తుంటారు.

WORLD SNAKE DAY

మాయా సర్పం: పూడుపాము

తరచూ మన ప్రాంతంలో వార్తల్లో ఉండేది పూడుపాము. దీనిని స్మగ్లింగ్ చేస్తూ పట్టుకున్నారు అని చదువుతూ ఉంటాం. విదేశాలకు దీనిని తరలిస్తుంటారని చెబుతారు. ఒక పాము విలువ కోటి దాకా పలుకుతుందని కూడా ప్రచారం. అయితే అసలు ఈ పాము ఎందుకు స్మగుల్ అవుతోంది? దీని వల్ల ఉపయోగాలు ఏమిటి అనే విషయంలో ఇప్పటికీ స్పష్టత లేదు. దీనికి అతీంద్రియ శక్తులుంటాయనీ, ఇంట్లో పెట్టుకుంటే అదృష్టం అనీ, ఔషధ విలువలుంటాయనీ.. ఇలా రకరకాల ప్రచారాలున్నాయి. ఇవి నిజమో కాదో కూడా తెలీదు. అయినా ఇవి స్మగుల్ అవుతూ దొరుకుతూనే ఉన్నాయి. రెండు తలలున్నట్టుగా కనిపించే పూడుపాము ఎటువైపునకైనా కదులుతుంది. మన జిల్లాలో చాలా ప్రాంతాల్లో విస్తృతంగా ఇవి కనిపిస్తాయి. చురుగ్గా ఉండదు. మట్టిలో దాగి ఉంటుంది. ఇది విషపు పాము కాదు. అయినా కరిస్తే ఒళ్లంతా వికారంగా మచ్చలు వస్తాయని అంటారు. అందుకే మన ప్రాంతంలో ఎవరిమీదైనా కోపం ఉంటే 'వాడ్ని పూడుపాము కరవ' అని శాపనార్థం పెడతారు. మనదేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ పూడుపాములు ఉంటాయి. ఇరాన్, పాకిస్తాన్‌లలో కూడా కనిపిస్తాయి.



పాములను చంపద్దు.. ప్లీజ్!

నిజానికి పాములు రైతులకు మిత్రులనే చెప్పాలి. రైతులు కష్టపడి పండించిన పంటలను ఎలుకలు, మిడతలు ఇతర కీటకాలు తిని ధ్వంసం చేయకుండా వాటిని ఆహారంగా తీసుకుని పాములు రైతులకు మేలు చేస్తుంటాయి. పంట పొలాల్లో, అడవుల్లో, చెరువుల్లో కనిపించే పాములు అన్నీ విషంగలవి కావు. విషసర్పాలు కూడా మనిషి మీదకు రావు. వాటికి మనవల్ల ప్రమాదం అనిపిస్తేనే కాటేస్తాయి. కనిపించగానే భయపడి చంపేయకుండా స్నేక్ రెస్క్యూ టీంకి సమాచారం ఇస్తే పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలేస్తారు. చంపేసుకుంటూ పోతే భూమ్మీద పాము అనేదే లేకుండా పోతుంది. ఇందువల్ల సమతుల్యత దెబ్బతింటుంది.





- లక్ష్మీ సౌజన్య, రమణ నాయక్, పాములపై పరిశోధకులు

వాలంగిరితోనే ప్రమాదం

సముద్రంలో చేపలు పట్టేందుకు ఎన్నో తరాలుగా మేం వెళ్తూనే ఉన్నాం. వలలో చేపలతో పాటు కొన్ని పాములు కూడా పడుతుంటాయి. వాటిలో వాలంగిరి పాము అత్యంత విషపూరితమైంది. ఈ పాము కరిచి మా పూర్వీకులు చాలామంది మరణించారు. దీనికి మందు దొరకడం అరుదు. మిగతావి కరిచినప్పటికీ అంత ప్రమాదం ఉండదు.



- దక్షాది నటరాజన్, మత్స్యకారుడు, గోవిందపల్లి, కోటమండలం

స్నేక్ ఫ్రెండ్ : మనుషుల నుంచి ఎటువంటి ప్రమాదం వాటిల్లకుండా దాదాపు 18వేల పాముల్ని పట్టుకుని భద్రంగా అడవుల్లో వదలిపెట్టిన స్నేక్ ఫ్రెండ్ ఒకరు తిరుపతిలో ఉన్నారు. తిరుమల కొండమీద, తిరుపతిలోనూ పాము కనిపించిందని సమాచారం అందగానే ప్రత్యక్షమైపోతారాయన. అలవోకగా పట్టి బంధించి దూరంగా విడిచిపెట్టే భాస్కర్‌నాయుడు కూడా రెండు సార్లు పాముకాటుకి గురై ప్రాణాలమీదకు తెచ్చుకున్నారు. అయినా ఈ పనిని శ్రీవేంకటేశ్వరస్వామి తనకు అప్పగించిన బాధ్యతగా భావిస్తారు. 1982లో టీటీడీ అటవీశాఖలో కూలీగా చేరిన ఆయన ఆ తర్వాత స్నేక్ క్యాచర్‌గా మారిపోయారు. ఆయన కోసమే ఒక పోస్టును టీటీడీ ఏర్పాటు చేయడం విశేషం. రిటైరై పదేళ్లయినా ఆయనకు కాంట్రాక్టు పద్ధతిలో అదే పనిని టీటీడీ అప్పగించింది. జీవవైవిధ్య పురస్కారాలు ఎన్నో అందుకున్న 69 ఏళ్ల భాస్కర్ నాయుడుకి శేషాచలం అడవుల్లో ఉండే అనేక రకాల పాముల గురించిన అవగాహన ఉంది.

"పాము.. రోడ్డుమీద, పార్కులో లేదా ఇంట్లోకి వచ్చినా భయంతో కేకలు వేస్తూ హడావుడి చేయవద్దు. పాము మీదకి రాళ్లు, చేతికందిన వస్తువులు, మట్టి వంటివి అసలు వేయకూడదు. అలా చేస్తే తనకు ప్రమాదం అని భావించి ఆత్మరక్షణ కోసం పాము తిరగబడుతుంది. కాటేస్తుంది. శబ్దం చేయకుండా దూరం నుంచి దాని కదలికలు గమనించండి. మనుషుల ఉనికి ఉన్నతావులో పాము ఉండదు. పొరపాటున వచ్చినా దూరంగా వెళ్లిపోతుంది. ఒకవేళ అక్కడే ఉండిపోతే టీటీడీ సిబ్బందికి సమాచారం ఇస్తే చాలు.. నేను వచ్చి దానిని పట్టుకుని దూరంగా తీసుకువెళ్లి విడిచిపెడతాను."

- భాస్కర్ నాయుడు, టీటీడీ స్నేక్‌క్యాచర్



సత్యవేడుపై ఎంతమంది పెత్తనం?

- సమన్వయం మాట వదిలి సమస్యలు వస్తున్నాయన్న ఎమ్మెల్యే ఆదిమూలం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): 'ఒకరేమో పరిశీలకులు అంటారు. మరొకరు కో-ఆర్డినేటర్ అంటారు. ఇంకొకరు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ అంటారు. సత్యవేడుపై ఇలా ఎంత మంది పెత్తనం చేస్తారు' అని ఎమ్మెల్యే ఆదిమూలం ప్రశ్నించారు. పిచ్చాటూరులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'సైకిల్ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేగా తానుండగా మరొకరికి ఇన్‌చార్జి పదవి ఎందుకు? ప్రతి పక్ష ఎమ్మెల్యేలున్న చోట మాత్రమే అది సాధ్యమవుతుంది. ఇప్పటికైనా అపోహలు వీడి కుల, గ్రూపు రాజకీయాలకు స్వస్తి చెప్పి నియోజకవర్గ అభివృద్ధి కోసం సమష్టిగా ముందుకెళదాం' అని పిలుపునిచ్చారు. సత్యవేడు నియోజకవర్గంలో కుల గ్రూపు రాజకీయాలను సమన్వయం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయడం కోసం టీడీపీ అధిష్ఠానం శంకర్‌రెడ్డిని పార్టీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా నియమించిందే తప్ప ఇన్‌చార్జిగా కాదని మరోసారి ఆయన స్పష్టంచేశారు. శంకర్‌రెడ్డి తనకు మిత్రుడు, సన్నిహితుడైనా కొందరు నేతల మాటలు నమ్మి తన ఓటమికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే హేమలత, మరికొందరు గ్రూపు రాజకీయ నేతలతో కలసి సభలు, సమావేశాలు, ప్రచార ఆర్భాటాలు చేయడం వల్ల ప్రభుత్వం ఆశించిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం మరుగున పడిపోతోందన్నారు. దీంతో పార్టీలో సమన్వయం మాట పక్కన నెట్టి పలు సమస్యలు వస్తున్నాయన్నారు. రిజర్వుడు నియోజకవర్గంలో ఇలాంటి పెత్తనాలు చేస్తే అంబేడ్కర్ ఆశయాలకు తూట్లు పొడిచినట్లు అవుతుందన్నారు. అలాంటి పనులకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సహకరించరని ఆయన స్పష్టంచేశారు. ఎవరెన్ని ఆరోపణలు చేసినా ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై ఉన్నానని, అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తూ సీఎం చంద్రబాబుకు విధేయుడిగా ఉంటానని చెప్పారు. ఈ సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సుమాంజలి, నీటి సంఘాల అధ్యక్షులు రవిరెడ్డి, పద్దురాజు, నాయకులు వాసురెడ్డి, ఢిల్లీ రాజేశ్వరి, రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ రాక

- రేపు ఐఐటీలో ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభోత్సవం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రి చిరాగ్ పాశ్వాన్ రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం జిల్లా పర్యటనకు విచ్చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం ఢిల్లీ నుంచి రేణిగుంట విమానాశ్రయానికి.. అక్కడ్నుంచి తిరుచానూరు వద్దనున్న తాజ్‌హోటల్‌కు చేరుకుని బస చేస్తారు. గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరిగి తాజ్ హోటల్‌కు చేరుకుంటారు. ఉదయం 11గంటలకు ఏర్పేడు వద్దనున్న ఐఐటీకి చేరుకుని ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం ఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు.

- వెయ్యి మంది కాదు 5 వేల మంది ఉన్నారు

తొలగించే దమ్ముందా?

- తిరుమలలో అన్యమతస్థుల అంశంపై చింతా మోహన్ సవాల్

తిరుపతి(వైద్యం), జూలై 15(ఆంధ్రజ్యోతి): 'తిరుమలలో వెయ్యి మంది కాదు.. ఐదువేల మంది అన్యమతస్థులు ఉన్నారు. భక్తుల సేవలో పారిశుధ్య పనులు చేస్తున్నారు. వారిని తొలగించే దమ్ము మీకుందా? తిరుపతి, తిరుమల గురించి మాట్లాడేందుకు బండి సంజయ్ ఎవరు?' అంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఘాటుగా స్పందించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ముందు మంగళవారం ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. దేశంలో అభివృద్ధిని బీజేపీ నేతలు పక్కన పెట్టి, ఎప్పుడూ అన్యమతం.. అన్యమతస్థులు అంటూ పవిత్రమైన తిరుమలపై రచ్చ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని వివరించారు. నిరుద్యోగులు, పూట గడవని నిరుపేదల గురించి పట్టించుకోకుండా ఎప్పుడూ అన్యమతంపై మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. తిరుమలలో అన్యమతస్థులు ఎవరు.. ఏం పని చేస్తారో మీకు తెలుసా అంటూ ప్రశ్నించారు. మీరు చెప్పే అన్యమతస్థులే నిత్యం భక్తుల మల, మూత్రాలను శుభ్రం చేస్తూ, అతి తక్కువ జీతాలకు పనిచేస్తూ పొట్ట నింపుకుంటున్నారన్నారు. వారిని తొలగిస్తే తెలంగాణ నుంచి కార్మికులను తీసుకొచ్చి పని చేయిస్తారా అంటూ వ్యాఖ్యానించారు. తిరుమలలో కాంగ్రెస్ హయాంలో తప్ప తర్వాత ఈవో, డిప్యూటీ ఈవో స్థాయిలో ఎస్సీలను నియమించకపోవడాన్ని చూస్తే తిరుమలలో అంటరానితనం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రస్తుతం ఉన్నతస్థాయిలో ఒక్క ఎస్సీ అధికారైనా తిరుమలలో ఉన్నారా అని ప్రభుత్వాన్ని అడిగారు. బ్యాంకుల రుణాల మాఫీ, ఎన్డీఏ పాలనలో జరిగిన రూ. లక్ష కోట్ల అవినీతిపై బండి సంజయ్ మాట్లాడితే బాగుంటుందన్నారు. టీటీడీలో పనిచేసే అర్చకులకు, శాశ్వత ఉద్యోగులకు 5 సెంట్ల నివాస స్థలాన్ని ఉచితంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు యార్లపల్లి గోపీగౌడ్, రవి, తేజోవతి, మునిశోభ తదితరులు పాల్గొన్నారు.



టీటీడీ పరిపాలన భవనం ముందు నిరసన తెలుపుతున్న చింతా మోహన్

ఎస్వీయూలో చిరుతల కలకలం

మంగళం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్శిటీతో పాటు పరిసర ప్రాంతాల్లో చిరుతలు విద్యార్థులు, ప్రజలను భయపెడుతున్నాయి. క్వార్టర్స్‌లోని పెంపుడు శునకాలను, వర్శిటీ సమీప ప్రాంతాల్లో ఉండే శునకాలను చిరుతలు వదలడంలేదు. చీకటి పడితే చాలు శేషాచల అటవీప్రాంతం నుంచి రీజనల్ సైన్స్‌సెంటర్ సమీప అటవీప్రాంతాల మీదుగా ఎస్వీ యూనివర్శిటీ, వేదిక్, వెటర్నరీయూనివర్శిటీ ప్రాంతాలకు చేరుకుంటున్నాయి. ఇక్కడ సమీప ప్రాంతాల్లోని హాస్టల్ వద్ద వేసిన ఆహారం కోసం శునకాలు వస్తుంటాయి. అయితే అప్పటికే మాటు వేసిన చిరుతలు వీటిని చంపితిని తిరిగి అడవుల్లోకి వెళ్లిపోతుంటాయి. అలా వాటికి ఆహారం దొరకనిపక్షంలో వర్శిటీలోని క్వాటర్స్, హాస్టళ్ల వద్దకు వస్తున్నాయి. గత వారం రోజులుగా రెండు చిరుతుల సంచరిస్తుండటాన్ని విద్యార్థులతో పాటు హాస్టల్స్‌సిబ్బంది , స్థానిక ప్రజలు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అటవీశాఖ అధికారులు మూడు ప్రాంతాల్లో బోన్లను కూడా ఏర్పాటు చేశారు. అలాగే చిరుతలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో 10 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రతి రోజు రాత్రి పూట ఆరుగురు సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తిరుపతి రేంజ్ అటవీశాఖ అధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. అయితే చిరుతల వల్ల ప్రమాదం ఎటువైపు నుంచి ముంచుకువస్తుందో అన్న భయంతోవిద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.



ఎస్వీ యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన కెమెరాకు చిక్కిన చిరుత



ఎస్వీ యూనివర్శిటీలో చిరుతల కోసం అటవీశాఖ సిబ్బంది ఏర్పాటు చేసిన బోను

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.72 కోట్లు
సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 74,149
తలనీలాలు సమర్పించినవారు: 29,066

192 ఎర్రచందనం దుంగల స్వాధీనం

నలుగురు స్మగ్లర్ల అరెస్టు

- కారు, మోటారు సైకిల్ స్వాధీనం

మంగళం, జూలై 15(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా చేజర్ల అటవీప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి 192 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఓ మోటారు సైకిల్, ఒక కారును సీజ్ చేశారు. టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సాయిగిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ లింగాధర్ బృందం, స్థానిక ఎఫ్‌బీవో జనార్దన్‌తో కలిసి మంగళవారం నెల్లూరుజిల్లా చేజర్ల అటవీప్రాంతంలోని కలువాయి ఫారెస్టు బీటు పరిధిలో కూంబింగ్ నిర్వహిస్తుండగా ఒక కారు, ఒక మోటారు సైకిల్‌తో కొందరు గుమికూడిపోలీసులకు కంటపడ్డారు. వారిని చుట్టుముట్టి పట్టుకునే ప్రయత్నం చేయగా వారు పారిపోయారు. అయితే టాస్క్‌ఫోర్సు పోలీసులు వారిని వెంబడించి నలుగురిని పట్టుకున్నారు. వీరిలో ఇద్దరు తమిళనాడుకు చెందివారు, మరో ఇద్దరు నెల్లూరు జిల్లాకు చెందివారుగా గుర్తించారు. కారులో లోడ్ చేసిన ఎర్రచందనం దుంగలతో పాటు సమీపంలో దుంగలను రీపర్లు, పలకలుగా మార్చి దాచి ఉంచిన వాటితో సహా 192 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.50లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. పట్టుబడ్డ స్మగ్లర్లను వాహనాలతో సహా ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు